తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాదాద్రి భువనగిరి
గురువారం
01 అక్టోబర్ 2026
పేజీలు : 8




# హాజరు తగ్గితే చర్యలు తప్పవు

- 60 శాతంలోపు హాజరున్న బడుల హెచ్ఎంలకు నోటీసులు
- 3 నెలలు ఎఫ్ఆర్ఎస్ నిబంధనలు పాటించకుంటే 2 ఇంక్రిమెంట్స్ కట్
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట (జనంసాక్షి):** విధులకు అలసత్వం వహించే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ లో విద్యాశాఖ సెప్టెంబరు మాస సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన ఈ సమీక్షలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ ప్రగతి, అధికారుల తనిఖీలు, స్పాట్ అసెస్మెంట్, పీఎంశ్రీ పనులు, మధ్యాహ్న భోజన నాణ్యత, భవిత కేంద్రాల పనితీరుపై ఆయన సమగ్ర సమీక్ష చేపట్టారు. జిల్లాలో ప్రస్తుతం విద్యార్థుల సగటు హాజరు కేవలం 69 శాతం మాత్రమే నమోదు కావడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లో హాజరు శాతం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. 60 శాతం కంటే తక్కువ హాజరు నమోదైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వెంటనే నోటీసులు జారీ చేసి, లిఖితపూర్వక వివరణ కోరాలని ఆదేశించారు.

**ఎఫ్ఆర్ఎస్ పాటించకుంటే ఇంక్రిమెంట్లు బంద్..**

ఉపాధ్యాయులు సైతం సమయపాలన పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. నెలకు 15 రోజుల కంటే తక్కువ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు ఉన్న ఉపాధ్యాయుల నుంచి తక్షణమే వివరణ తీసుకోవాలని ఆదేశించారు. ఒకే ఉపాధ్యాయుడు వరుసగా మూడు నెలల పాటు ఇదే తీరును పునరావృతం చేస్తే, రెండు ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల నుంచి మండల స్థాయిలోనే కాకుండా, ఉపాధ్యాయుల వారీగా, అక్టోబర్ 1 నుండి జరిగే సమ్మేటివ్ పరీక్షల ఫలితాల మీద ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ హరిసింగ్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, క్వాలిటీ కోఆర్డినేటర్ హరికృష్ణ, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



**అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వరస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ హరి గోపాల్ కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో చెక్కు రూపంలో 1,00,000/-(లక్ష రూపాయల) నగదును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు మరియు సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వం తరఫున మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు.

### వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు
## ఓటరు నమోదు షెడ్యూల్ విడుదల



వార్తా లోపలి పేజీలో

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై
## ప్రత్యేక దృష్టి పెట్టాలి
### కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు, జాబితా తయారీపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వరంగల్- ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా తయారీ, ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ మిగతా 2లో

## ఉపాధి హామీ కార్యాలయంలో వేళపాళ లేని సిబ్బంది

- సమయానికి తెరుచుకోని ఆఫీసు ఇబ్బందుల్లో ప్రజలు, కూలీలు
- నచ్చిన వేళకు వస్తూ నచ్చినట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజల విజ్ఞప్తి

**మాడుగులపల్లి, సెప్టెంబరు 30 ( జనంసాక్షి):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలోని వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఇ ఆజీవిక మిషన్ (ఎం జి ఎన్ ఆర్ జి ఎస్/ ఉపాధి హామీ) కార్యాలయం నిర్వహణ తీరుపై స్థానిక ప్రజలు, గ్రామీణ కూలీల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆఫీసు సమయానికి తెరుచుకోవాల్సి ఉన్నప్పటికీ, సిబ్బంది తమకు నచ్చిన రీతిలో వ్యవహరిస్తూ కార్యాలయాన్ని ససమయానికి తెరవడం లేదని మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం, జాబ్ కార్డ్ సమస్యలు, కూలి డబ్బుల వివరాలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఉదయాన్నే కార్యాలయానికి వచ్చే గ్రామీణులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది ఆఫీసు తలుపులు మూసి ఉండడం, సిబ్బంది జాడ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ కార్యాలయ వేళలను బేఖాతరు చేస్తూ, ఇష్టారాజ్యంగా సమయపాలన పాటిస్తున్న అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు ప్రజా సమస్యలను తీర్చాల్సిన కార్యాలయంలో ఇటువంటి నిర్లక్ష్యం తగదని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, డ్వామా అధికారులు స్పందించి మాడుగులపల్లి ఉపాధి హామీ కార్యాలయంలో సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై తగిన విచారణ జరిపించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం: సర్పంచ్ అనిత

**పినపాక, సెప్టెంబర్ 30(జనంసాక్షి):** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం నిర్మించవచ్చని సీతారాంపురం సర్పంచ్ అనిత గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బుధవారం పినపాక ఎంపీడీవో ఆదేశాల మేరకు సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలో పెంటన్నగూడెం, సీతారాంపురం గ్రామంలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. చీపురు పట్టి స్వయంగా పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలో ఐటిసి అందజేసిన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, ఐటీసీ సిబ్బంది పవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి : ఎస్ ఐ షాకీర్



**పెనుబల్లి సెప్టెంబర్ 30 (జనంసాక్షి)** తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌర హక్కులు అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని అడవి మల్లెల గ్రామపంచాయతీ కార్యాలయం నందు అవగాహన సదస్సును నిర్వహించారు. పెనుబల్లి తహసిల్దార్ వీరభద్ర నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన వి.ఎం.బంజర్ ఎస్ ఐ షాకీర్ మాట్లాడుతూ పౌరులు రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కులను పొందాలంటే తమ యొక్క పిల్లలను బాధ్యతగా చదివించి ప్రయోజకులను చేయడం ద్వారానే పూర్తిస్థాయిలో హక్కులను పొందగలుగుతామని అన్నారు. తహసిల్దార్ వీరభద్ర నాయక్ మాట్లాడుతూ సమాజంలో వివక్షకు గురైన వారు ఎవరైనా మీకున్న హక్కుల ద్వారా తహసిల్దార్ కార్యాలయాన్ని గానీ,పోలీస్ శాఖను గాని సంప్రదించి న్యాయం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారులు బజ్జూరు వెంకటేశ్వరావు,తిరుపతమ్మ, అడవి మల్లెల గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్ తేళ్ళ ఆనందరావు,మాజీ సర్పంచ్ మందడపు. అశోక్ కుమార్,గ్రామస్తులు పులపాక .వెంకటేష్, చిల్లిముంత. కృష్ణ, జొన్నలగడ్డ. నాగేశ్వరరావు, పులపాక.రవి కంటెపూడి. రవీందర్, జొన్నలగడ్డ. సునీత, జొన్నలగడ్డ.నరసమ్మ, చిన్న నరసింహ,పెద్ద నరసింహ, జొన్నలగడ్డ.సత్యం కొంగల.మోహనావు కొంగల. కృష్ణ కొంగల.గోపి, కొంగల.వెంకటేశ్వరరావు, మోదుగు. రాములు,నాగేశ్వరరావు, జొన్నలగడ్డ. నాగరాజు జిపిఓ బేబీ,గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోవిందాపురం బ్రిడ్జి నిర్మాణానికి సర్వే

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** పట్టణంలోని గోవిందాపురం అంబేద్కర్ కళావేదిక సెంటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం ఎన్ఎస్పీ అధికారులు



సర్వే చేశారు. గతంలో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో బ్రిడ్జి నిర్మాణం చేయాలని కౌన్సిలర్ ఉదయభానుఉపేందర్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు సర్వే నిర్వహించారు. బుధవారం ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉదయభానుఉపేందర్ మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ సహకారంతో స్మశాన వాటికకు వెళ్లే దారిలో గల బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి సర్వే చేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సర్వేలో ఎన్ఎస్పి అధికారులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్ దివాకర టిఎస్

రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ× ఎస్ఐఆర్ ప్రక్రియలో 1,75,858 అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు గుర్తించగా, వారిలో 1,69,802 మందికి నోటీసులు అందజేశామని, 1,36,208 మంది ఓటర్ల హియరింగ్ పూర్తి చేశామని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న 5,460 ఫారం-6, 1,172 ఫారం-7 దరఖాస్తులు, 9,087 ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అభ్యంతరాల సమర్పణకు అక్టోబర్ 7 చివరి తేదీ అని, నవంబర్ 5 వరకు నోటీసుల ప్రక్రియ, అభ్యంతరాల పరిష్కారం అనంతరం నవంబర్ 9న తుది ఎస్ఐఆర్ జాబితా ప్రచురించే ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

**ప్రతి పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయాలి**

వరంగల్?ఖమ్మం?నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రతి ఎన్నికల సమయంలో పట్టభద్రులు తప్పనిసరిగా తాజాగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.తేది: 31-10-2023 నాటికి పట్టభద్రులైన అర్హులు, 01-11-2026ను అర్హత తేదీగా తీసుకొని రూపొందించే ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం-18ను పట్టభద్రత ధ్రువీకరణ పత్రంతో సంబంధిత ఈఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**2 లక్షల మంది పట్టభద్రుల నమోదు లక్ష్యం:**

గతంలో ఖమ్మం జిల్లాలో సుమారు 84 వేల మంది పట్టభద్రులు మాత్రమే ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు అయ్యారని, ఈసారి కనీసం 2 లక్షల మంది పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహించి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించడంతో పాటు ప్రత్యేక పోస్టర్లు, అవగాహన వీడియోలు రూపొందించి ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు: జిల్లాలోని ప్రతి డిగ్రీ, ప్రొఫెషనల్, పీజీ కళాశాలలో ప్రత్యేక ప్రచార దినోత్సవం నిర్వహించి కళాశాల నుండి గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారి వివరాలు తీసుకొని, అర్హులైన పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో మొత్తం ఓటర్ల జాబితాను పరిశీలించి, 25 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఓటర్లలో పట్టభద్రులైన వారిని గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు.

**ఎమ్మెల్సీ ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలి:**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత ఓటు తదితర అంశాలపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలి, ప్రాధాన్యతా ఓటు విధానం ఎలా ఉంటుంది అనే అంశాలపై అవసరమైన అవగాహన వీడియోలను రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వరంగల్?ఖమ్మం?నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి 01-11-2026 ను అర్హత తేదీగా తీసుకొని ఓటరు జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.ఓటర్ జాబితా నమోదు నోటిఫికేషన్ 28-09-2026న, మొదటి పునఃప్రచురణ 15-10-2026న, రెండో పునఃప్రచురణ 25-10-2026న జరుగుతుందని తెలిపారు.ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు 06-11-2026 చివరి తేదీ అని పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ముద్రణ 20-11-2026 నాటికి పూర్తి చేసి, 25-11-2026న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను 25-11-2026 నుంచి 10-12-2026 వరకు స్వీకరిస్తామని, వాటిని 25-12-2026 లోపు పరిష్కరించి, 30-12-2026న తుది ఓటరు జాబితాను ప్రచురించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జాబితా విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎస్‌డీసీ సదానందం, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీఆర్ ఎస్ వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సీపీఎం పార్టీ ప్రతినిధులు డి. తిరుపతి రావు, ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధులు అన్నెం గోపాల్ రావు, జి. సూర్యనారాయణ, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**మేధో వైకల్యం కలిగిన విద్యార్థులకు ఇంటి వద్దే విద్యాబోధన అందించాలి**



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్30 (జనంసాక్షి):** చుంచుపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృతంగా పర్యటించి భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించడంతో పాటు చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ముందుగా చుంచుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సర్వే పురోగతి, భూ సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.చుంచుపల్లి గ్రామ పరిధిలో మొత్తం 2 వేల 27 ఎకరాల 30 గుంటల భూమి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ భూములతో పాటు వ్యవసాయ భూముల భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో భూ సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడంతో పాటు, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అనంతరం చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రగతిని, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించి, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మేధో వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించి, వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు హాజరు కావడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అటువంటి విద్యార్థులకు ఇంటి వద్దే విద్యాబోధన అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి విద్యకు దూరం కాకుండా, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుధ్యం తదితర సదుపాయాలను వివరాలను అడిగి తెలుసుకున్నారు . పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేతకు పూర్వవైభవం.. కార్మికులకు ఉపాధి భరోసా!

- నష్టాల నుంచి సంఘాన్ని గట్టెక్కిద్దాం.. ప్రభుత్వ నిధులతో పునర్జీవం పోద్దాం!
- సంఘం అధ్యక్షురాలు కర్నాటి వజ్రమ్మ.. మాజీ ఆప్కో డైరెక్టర్ కర్నాటి వెంకటేశం పిలుపు
- గట్టుప్పల్ చేనేత సహకార సంఘం 75వ వార్షికోత్సవం.. 57వ సాధారణ మహాసభలో అభివృద్ధిపై చర్చ

**గట్టుప్పల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)**

ఒకప్పుడు వందలాది చేనేత కుటుంబాలకు జీవనాధారంగా నిలిచి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన గట్టుప్పల్ చేనేత సహకార సంఘానికి తిరిగి పూర్వవైభవం తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైంది. నష్టాల బారినపడి ఉపాధి అవకాశాలు కోల్పోతున్న చేనేత కార్మికులను ఆదుకోవడంతోపాటు, ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమకూర్చుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని సంఘం అధ్యక్షురాలు కర్నాటి వజ్రమ్మ, జిల్లా మాజీ ఆప్కో డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల మనుగడను కాపాడుకోవడం, సహకార సంఘాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని వారు పేర్కొన్నారు. బుధవారం గట్టుప్పల్ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం 75వ వార్షికోత్సవం, 57వ సాధారణ మహాసభను కామన్ ఫెసిలిటీ సెంటర్ భవనంలో సంఘం అధ్యక్షురాలు కర్నాటి వజ్రమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం ప్రస్తుత పరిస్థితులు, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం ఆర్థిక బలోపేతం, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.




**చేనేత కార్మికులను బతికించుకోవడమే మా లక్ష్యం**

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు కర్నాటి వజ్రమ్మ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా వెనుకబడిన చేనేత సహకార సంఘాన్ని తిరిగి ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. సంఘం బలోపేతం కావడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతోపాటు, వారిపై ఆధారపడిన కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.చేనేత రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికుల ఉపాధిని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. సంఘం అభివృద్ధికి పాలకవర్గం, సభ్యులు, చేనేత కార్మికులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సంఘానికి పూర్వవైభవం తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వ నిధులతో సంఘానికి పునర్జీవం పోస్తాం**

జిల్లా మాజీ ఆప్కో డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం మాట్లాడుతూ, గట్టుప్పల్ చేనేత సహకార సంఘాన్ని తిరిగి బలోపేతం చేసి, చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న నిధులను సమకూర్చుకుని సంఘానికి పునర్జీవం పోసేందుకు కృషి చేస్తానని తెలిపారు. గతంలో తగిన మూలధనం లేకపోవడం, ఆర్థిక వనరుల కొరత వంటి సమస్యల కారణంగా సంఘం క్రమంగా బలహీనపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగించే కార్మికులకు కనీస ఉపాధి అవకాశాలు కూడా కరువవుతున్న పరిస్థితులు బాధాకరమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంఘాన్ని నిర్లక్ష్యం చేయకుండా, దాని మనుగడను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమకూర్చుకోవడం, సంఘానికి అవసరమైన ఆర్థిక వనరులను పెంపొందించడం, కార్మికులకు ఉపాధి కల్పించే అవకాశాలను అన్వేషించడం ద్వారా సహకార సంఘాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించవచ్చని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు పాలకవర్గం, సభ్యులు, చేనేత కార్మికులు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

**ఒకప్పుడు వెయ్యి మగ్గాలతో ప్రత్యేక గుర్తింపు**

గట్టుప్పల్ చేనేత రంగానికి గతంలో ఉన్న ప్రాధాన్యతను కర్నాటి వెంకటేశం ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పోచంపల్లి ప్రాంతంలో సుమారు 1,200 మగ్గాలు ఉండగా, గట్టుప్పల్ ప్రాంతంలో సుమారు 1,000 మగ్గాలతో రెండో స్థానంలో నిలిచిన ఘనత ఉందని తెలిపారు. ఇంతటి చరిత్ర, గుర్తింపు కలిగిన చేనేత రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించి తిరిగి పూర్వస్థితికి చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు.చేనేత కార్మికుల నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటూ, సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చేనేత రంగం అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు, అనేక కుటుంబాలకు జీవనాధారం లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో గట్టుప్పల్‌కు ఉన్న ప్రత్యేక గుర్తింపును తిరిగి సాధించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సంఘం అభివృద్ధికి సంపూర్ణ సహకారం**

అనంతరం సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ, గట్టుప్పల్ చేనేత సహకార సంఘానికి పూర్వవైభవం తీసుకురావాలనే కర్నాటి వెంకటేశం పట్టుదలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సంఘం అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, సంఘం ఆర్థిక బలోపేతం, ఉపాధి అవకాశాల పెంపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అభిప్రాయపడ్డారు. సంఘం 75 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తులో మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ సహకారం, పాలకవర్గం చొరవ, సభ్యుల భాగస్వామ్యంతో సంఘాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించవచ్చని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ నామని జగన్నాథం, పాలకవర్గం ఉపాధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి నరేందర్, కోశాధికారి జిల్లా మహాలక్ష్మి, డైరెక్టర్లు చంద్రమౌళి, వెంకటేశం, జగన్, యాదయ్య, విజయలక్ష్మి, మేనేజర్ అయోధ్య, రమేష్, గణేష్, నాగమణి, గుర్రం సత్తయ్య, కిషోర్, శ్రీనివాస్, ఆంజనేయులు, చంద్రమౌళి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు న్యాయం చేయాలి..
# అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి
### బీసు చందర్ గౌడ్

**ఆత్మకూర్ (ఎం) సెప్టెంబర్ (30) జనంసాక్షి**

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో నిజమైన అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను డ్రా పద్ధతిలో అర్హులను ఎంపిక చేసి మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం తొలి విడత ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే మంజూరు చేసిందని ఆయన ఆరోపించారు. దీంతో నిజమైన అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని అన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన కోరారు. అర్హులకు అన్యాయం జరిగితే ప్రజల నుంచి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని, వారి తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని బీసు చందర్ గౌడ్ అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి, కోరే బిక్షపతి, పంజాల వెంకటేష్, మాజీ సర్పంచ్ పర్వతాలు, మామిడి శ్రీనివాస్ రెడ్డి, కోరి వెంకన్న, నాతి రాజు, నాతి స్వామి, మజ్జిగ రాంబాబు, సోలిపురం రామ్ రెడ్డి, యువజన నాయకులు చుంచు నాగరాజు, మహ్మద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### సూపరింటెండెంట్ రామకృష్ణకు పదవీ విరమణ సన్మానం

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**

జాజిరెడ్డిగూడెం మండల ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామకృష్ణ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని బుధవారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ పల్లపు ఝాన్సీ, ఏపీఓ నాగయ్య, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ప్రవీణ్, శ్రవణ్, సర్పంచ్ లు వల్లపు గంగయ్య, సున్న యాదగిరి, బొడ్డు ఇందిర, టీఏలు యాదమ్మ, నాగమణి, దీపిక, సీ ఓ సుధీర్ రెడ్డి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.




# దళిత కుటుంబాన్ని వేధించారని ఆరోపణ
## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30,(జనం సాక్షి):**

దొంగతనం నెపంతో దళిత కుటుంబాన్ని వేధించి, కులం పేరుతో దూషించి అవమానాలకు గురిచేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బకరం శ్రీనివాస్ మాదిగ, కొత్తపల్లి నాగరాజు డిమాండ్ చేశారు.నల్లగొండ మండలం కుదవన్‌పూర్ గ్రామ పరిధిలోని కొత్తపల్లి శంకర్ కుటుంబానికి దొంగతనంతో సంబంధం లేదని చెప్పినప్పటికీ, అదే గ్రామానికి చెందిన జానారెడ్డి తమను, కుటుంబ సభ్యులను వేధించారని బాధితులు ఆరోపించారు. ఇంటిపైకి వచ్చి దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారని, కులం పేరుతో దూషించి సామాజికంగా అవమానించారని వారు పేర్కొన్నారు.ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు కొత్తపల్లి శంకర్, కొత్తపల్లి సరిత, కొత్తపల్లి నాగరాజు సోమవారం నల్లగొండ జడ్పీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమకు ఎదురైన ఇబ్బందులను వివరించారు.దొంగతనం కేసు విచారణ పేరుతో శంకర్‌కు సంబంధం లేని కుటుంబ సభ్యులను, ఇతర ప్రాంతాల్లో చదువుకుంటున్న పిల్లలను సైతం పిలిపించి విచారించి వేలిముద్రలు తీసుకున్నారని బాధితులు ఆరోపించారు. విచారణ



పేరుతో థర్డ్ డిగ్రీ పద్ధతులు ప్రయోగించి వేధించారని వారు పేర్కొన్నారు.అయితే నార్కట్‌పల్లి మండలం జువ్విగూడకు చెందిన రామ్‌రెడ్డి అనే వ్యక్తిని దొంగతనం కేసులో పట్టుకుని, అతని వద్ద నుంచి చోరీకి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు బాధితులు తెలిపారు. అలాంటప్పుడు తమ కుటుంబాన్ని దొంగతనం నెపంతో ఎందుకు వేధించారని ప్రశ్నించారు.బాధితుల ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. కులం పేరుతో దూషణలు, ఇంటిపై దాడి, బెదిరింపులు, కుటుంబ సభ్యుల వేధింపులకు సంబంధించి ఫిర్యాదులను పరిశీలించి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధితులు ఇప్పటికే జిల్లా ఎస్పీతో పాటు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు సమగ్ర విచారణ జరగలేదని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. వెంటనే విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు అవసరమైన పోలీసు రక్షణ కల్పించాలని కోరారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజా సంఘాలు అండగా ఉంటాయని పాలడుగు నాగార్జున, బకరం శ్రీనివాస్ మాదిగ, కొత్తపల్లి నాగరాజు తెలిపారు.




# వేధింపులపై ఉక్కుపాదం.. మహిళలకు షీ టీమ్ అండ

## ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి.. అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలని అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

**కోదాడ, సెప్టెంబర్ 30(జనంసాక్షి):**
మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్‌లు మరింత సమర్థవంతంగా పనిచేయాలని అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని షీ టీమ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, నమోదైన కేసులు, ఫిర్యాదుల వివరాలను పరిశీలించారు. షీ టీమ్ సిబ్బంది నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఇప్పటివరకు తీసుకున్న
చర్యలపై ఎస్సై మల్లేష్‌ను అడిగి తెలుసుకున్నారు. మహిళలు, బాలికలకు ఎదురవుతున్న వేధింపులు, అసౌకర్యాలపై అధికారులు తీసుకుంటున్న చర్యలను అదనపు ఎస్పీ సమీక్షించారు. మహిళలకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే షీ టీమ్‌ను ఆశ్రయించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ షీ టీమ్ సేవలను ప్రజలకు చేరువ చేయాలని ఆదేశించారు. మహిళల భద్రతకు సంబంధించి అందే ప్రతి ఫిర్యాదుపై సిబ్బంది తక్షణమే స్పందించాలని, బాధితులకు ధైర్యం కల్పిస్తూ వారికి అండగా నిలవాలని రవీందర్‌రెడ్డి సూచించారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. షీ టీమ్‌ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, రూరల్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి, షీ టీమ్ ఎస్సై మల్లేష్, ట్రాఫిక్ ఎస్సై బైరెడ్డి అంజిరెడ్డి, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

## టీయూడబ్ల్యూజే(143) జిల్లా అధ్యక్షుడు జయశంకర్ గౌడ్

**నల్లగొండ ప్రతినిధి,సెప్టెంబర్30,(జనంసాక్షి):** జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా టీయూడబ్ల్యూజే(143) పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగోని జయ శంకర్ గౌడ్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే(143) నల్లగొండ మండల కమిటీని అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం గతంలో హెల్త్ కార్డుల సాధనతో పాటు మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం, వారి పిల్లల విద్యకు చేయూత అందించినట్లు తెలిపారు. కరోనా సమయంలోనూ అల్లం నారాయణ ఆధ్వర్యంలో కరోనా బారిన పడిన జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం జర్నలిస్టుల హెల్త్ కార్డులు కొన్ని ఆసుపత్రుల్లోనే పరిమితంగా అమలవుతున్నాయని, రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో కార్డులు చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు కూడా క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలని కోరుతూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పోస్టుకార్డు కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే(143) నల్లగొండ మండల నూతన అధ్యక్షుడిగా చిక్కుల యాదగిరి (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శిగా పేరం సుభాష్ (వార్తా వేదిక సూర్య) ఎన్నికైన సందర్భంగా వారిని జిల్లా అధ్యక్షుడు జయశంకర్ గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోలి విజయ్‌కుమార్, నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, నరసింహమూర్తి, జిన్నే శ్రీనివాసరెడ్డి, పోగుల రమేష్, ముచ్చర్ల శ్రీనివాస్, కారింగు వెంకన్న, ఎర్రబెల్లి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పౌర హక్కును కాపాడాలి

## ○తహసిల్దార్ జి రాజశేఖర్ రెడ్డి

**పెన్ పహాడ్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి ) :**
అంటరానితనాన్ని నిర్మూలించి పౌర హక్కులను కాపాడాలని తహసిల్దార్ జి రాజశేఖర్ రెడ్డి అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని లింగాల గ్రామంలో గ్రామ ప్రజలకు భారత రాజ్యాంగ హక్కులు, విధులు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్ఐ రాములు, గ్రామ పంచాయతీ కార్యదర్శి చెరుకుపల్లి జానయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం.. ఉపాధ్యాయురాలి మృతి

**కోదాడ,( జనంసాక్షి):**
కోదాడ: పట్టణ శివారులోని రంగన్నగుడి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఉపేంద్ర అనే ఉపాధ్యాయురాలు కళాశాల నుంచి కోదాడకు వెళ్తుండగా స్కూల్ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# జిల్లాస్థాయి పోటీల్లో జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల : విద్యార్థుల ప్రతిభ

**ఆత్మకూర్(ఎం) జనంసాక్షి :**
జిల్లాస్థాయి స్పెల్ బీ, జనరల్ నాలెడ్జ్ (క్విజ్), మాక్ అసెంబ్లీ పోటీల్లో పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ ఆత్మకూర్(ఎం) విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన స్పెల్ బీ పోటీల్లో పాఠశాల విద్యార్థిని జెట్ట ఆరాధ్య ప్రత్యేక బహుమతి సాధించగా, బోడ చందు జనరల్ నాలెడ్జ్ (క్విజ్) పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడు. అలాగే రచ్చ ఐశ్వర్య మాక్ అసెంబ్లీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకుంది. జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచడం పాఠశాలతో పాటు తల్లిదండ్రులు, గ్రామానికి గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు విద్యతో పాటు విజ్ఞాన, సృజనాత్మక, పోటీ పరీక్షలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# చిరుధాన్యాలతో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం

## పోషణ మాసంలో మాట్లాడుతున్న సూపర్వైజర్ కోట సరిత

**పెన్ పహాడ్ సెప్టెంబరు 30 (జనంసాక్షి) :**
చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలతోనే విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ కోట సరిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ సెంటర్ -1 లో క్లస్టర్ స్థాయి పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులకు ఇంటిదగ్గర చిరుధాన్యాలతో తయారుచేసిన పౌష్టికాహారాన్ని అందించాలని, వాటి ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆమె అన్నారు గర్భిణీ స్త్రీలకు పిల్లల తల్లిదండ్రులకు పోషణ మాసం కార్యక్రమం పై అవగాహన కల్పించి అంగన్వాడి కార్యకర్తలకు ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడి సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఒగ్గు వీరయ్య, ఎడవెల్లి సతీష్, ఒగ్గు విక్రమ్, ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వగ్గు సోమన్న, పంచాయతీ కార్యదర్శి జి. నాగరాజు, ఏఎన్ఎం గీత, అంగన్వాడి కార్యకర్తలు దాసరి విజయ, గుండెపునేని ఊర్మిళ, ఊరుకొండ సుజాత, బోలిశెట్టి భాస్కరమ్మ,ఆశా కార్యకర్త గూడపూరి కవిత, వివిధ గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

## ○ పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు సమగ్ర పరిశీలన

## ○ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి



**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**
హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వార్షిక తనిఖీ నిర్వహించారు. హుజూర్‌నగర్ సీఐతో కలిసి స్టేషన్‌లోని రికార్డులు, రిజిస్టర్లు, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరును సమగ్రంగా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత సమయంలో చార్జిషీట్లు దాఖలు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు, వారెంట్లు, అన్‌డిటెక్టెడ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లు, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిఘా పెంచి, పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం ఎస్సై లతో కలిసి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. ప్రజల ఫిర్యాదులను సిసి టిఎన్ఎస్ లో నమోదు చేసి సత్వరమే పరిష్కరించాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ గజ్జె. చరమందరాజు, ఎస్ఐ లు చలికంటి నరేష్, హనుమాన్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా డాక్టర్ డాక్టర్ దశరథ్



**కోదాడ, సెప్టెంబర్ 30( జనం సాక్షి):** కోదాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సీనియర్ సర్జన్, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ దశరథ్ ఎంఎస్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్‌గా నియమితుల య్యారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నియామకంపై జిల్లా వ్యాప్తంగా వైద్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ దశరథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వైద్య రంగంలో సీనియర్ సర్జన్‌గా విశేష అనుభవం ఉన్న డాక్టర్ దశరథ్.. ప్రభుత్వ వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. కోదాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, రోగులకు మెరుగైన వైద్య సేవల అందించడంలో కీలకంగా పనిచేస్తున్నారు. కరోనా విపత్కర సమయం లోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలు అందించారు నిరుపేదలకు ఉచిత వైద్యం, రక్తదాన శిబిరాలు, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణలో ఆయన సేవలు ప్రశంసలు అందుకున్నాయి. ఇదే సమయంలో కోదాడకు చెందిన సామాజిక కార్యకర్త కొమరగిరికి కూడా రెడ్‌క్రాస్ డైరెక్టర్ పదవి లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ దశరథ్ ఎంఎస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రెడ్‌క్రాస్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తానని పేర్కొన్నారు.

## త్రీఫేజ్ విద్యుత్ అంతరాయాలు లేకుండా అందించాలని బీజేపీ డిమాండ్..

**నేరేడుచర్ల, సెప్టెంబర్ 30(జనంసాక్షి):** రైతులకు సరైన విద్యుత్ సరఫరా చేయాలని, ముఖ్యంగా పంటలు కీలక దశలో ఉన్న సమయంలో త్రీఫేజ్ విద్యుత్ అంతరాయాలు లేకుండా అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ అధ్యక్షులు కొనతం నాగిరెడ్డి, చింతకుంట్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో నేరేడుచర్ల విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి స్పందించిన విద్యుత్ శాఖ వారు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించి, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్ల.నరేందర్ రెడ్డి, సంకలమద్ది. సత్యనారాయణ రెడ్డి, ఆకుల జాతయ్య గౌడ్, ఏమిరెడ్డి శంకర్ రెడ్డి,, కొప్పుల లక్ష్మీ నారాయణ, జూలూరి అశోక్, నందిపాటి హిందూజా, ఉరిమల్ల రామూర్తి, సీనియర్ నాయకులు బాల వెంకటేశ్వర్లు, బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మండల, పట్టణ నాయకులు, పాలకవీడు మండల అధ్యక్షులు నర్రి.నాయక్, కిసానమోర్చా అధ్యక్షులు తాటికొండ పరమేష్ రెడ్డి కాలం. నాగయ్య,, కాంపెల్లి నారాయణరెడ్డి, కాలం.శైలజ, మల్లి రెడ్డి రఘు, దేవిరెడ్డి , నాగిరెడ్డి, బుస్సా విమల తదితరులు పాల్గొన్నారు.





## కేంద్ర బృందం పరిశీలన వేగంగా సాగుతున్న వీబీ-గ్రామ్‌జీ పనులు

**పెద్దపూర సెప్టెంబర్ 30 (జనంసాక్షి )** మండల పరిధిలోని కోమటికుంట తండా, కుంకుడుచెట్టు తండాల్లో గ్రామీణాభివృద్ధి? లక్ష్యంగా జరుగుతున్న వీబీ-గ్రామ్‌జీ (ఎ:-ఉపీంఒట) పనులు శరవేగంగా సాగుతున్నాయి. బుధవారం కేంద్ర రూరల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ (ఓనీఖీఅ) ప్రతినిధుల బృందం ఈ తండాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, పనుల పురోగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు స్థానిక వేతనదారులతో నేరుగా ముచ్చటించారు. కూలీలకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, పనుల నాణ్యత మరియు క్రమం తప్పకుండా అందుతున్న వేతనాల చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఉపాధి కల్పనతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఈ పనులు ఎంతగానో దోహదపడుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎంవోఆర్‌డి ప్రోగ్రామ్ ఆఫీసర్ కిరణ్ చరణ్ పాలీ, సీఆర్‌డి ప్రాజెక్టు మేనేజర్ మురళి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ అబేద్ ఖాన్, అదనపు పీడీ హరీష్ కుమార్, డీపీవో బాలకృష్ణ, ఏపీడీ జ్యోతిలక్ష్మి, ఎంపీడీవో ఉమాదేవి, స్థానిక ఏపీవో, ఈసీలు మరియు కోమటికుంట తండా సర్పంచ్ పాల్గొన్నారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను సర్పంచ్ బృందానికి వివరించగా, అధికారులు స్థానిక యంత్రాంగాన్ని అభినందించారు.



## పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**సూర్యాపేట(జనంసాక్షి):** ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఖరారైన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పీసీసీ అధ్యక్షులుమహేష్ కుమార్ గౌడ్ ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలు, ప్రచార నిర్వహణ, గ్రాడ్యుయేట్ ఓటర్లను సమన్వయం చేసుకోవడం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనను ఎంపిక చేసిన పార్టీ అధిష్ఠానానికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి సర్వోత్తమ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



**వలిగొండ, సెప్టెంబర్ 30 (జనం సాక్షి )** మండలంలోని కేర్చిపెల్లి గ్రామానికి చెందిన మద్దెల వెంకటేశం (65) ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వలిగొండ అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# మాల్ మార్కెట్ కమిటీ పీఠంపై ఉత్కంఠ!

- ముగిసిన పాలకవర్గం పదవీకాలం.. కొత్త పాలకవర్గంపై ఆశావహుల గురి!
- చైర్మన్ పదవి కోసం మర్రిగూడ, నాంపల్లి నాయకుల ప్రయత్నాలు
- ప్రస్తుత పాలకవర్గానికి ఆరు నెలల పొడిగింపు దక్కేనా?




**మాల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)** మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రెండేళ్ల పదవీకాలం ముగియడంతో కొత్త పాలకవర్గం నియామకంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. 2024 సెప్టెంబర్ 28న బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం 2026 సెప్టెంబర్ 27తో ముగిసింది. దీంతో తదుపరి పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులు ఎవరిని వరించనున్నాయనే చర్చ జోరందుకుంది. మరోవైపు, ప్రస్తుత పాలకవర్గం పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

**మూడు మండలాలు.. చైర్మన్ పీఠంపై ఆశలు!**

మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో చింతపల్లి, మర్రిగూడ, నాంపల్లి మండలాలు ఉన్నాయి. గత పాలకవర్గంలో చైర్మన్ పదవి చింతపల్లి మండలానికి దక్కింది. ప్రస్తుతం పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ఈసారి చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనే అంశం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా మర్రిగూడ, నాంపల్లి మండలాలకు చెందిన నాయకులు చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకుని తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ ముఖ్య నాయకుల ద్వారా పదవులు దక్కించుకునేందుకు పైరవీలు సాగిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**గతంలో జనరల్ కేటగిరీ.. ఈసారి ఏ రిజర్వేషన్?**

మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకంలో రిజర్వేషన్లు కీలక పాత్ర పోషించనున్నాయి. గతంలో జనరల్ కేటగిరీకి అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈసారి కూడా అదే కేటగిరీ కొనసాగు తుందా? లేక రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసు కుంటాయా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే ఆశావహుల అవకాశాలు ఆధారపడి ఉంటాయి. రిజర్వేషన్లు ఏ విధంగా ఖరారవుతా యనే దానిపై స్పష్టత వచ్చిన తర్వాతే చైర్మన్ పదవికి పోటీ పడే నాయకుల అవకాశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**ప్రస్తుత పాలకవర్గానికి పొడిగింపు లభిస్తుందా?**

రెండేళ్ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుత పాలకవర్గం స్థానంలో కొత్త పాలకవర్గాన్ని నియమిస్తారా? లేక ప్రస్తుత పాలకవర్గానికే మరో ఆరు నెలల పాటు పొడిగింపు ఇస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.

**మర్రిగూడకా.. నాంపల్లికా.. ఉత్కంఠ!**

గతంలో చింతపల్లి మండలానికి చైర్మన్ పదవి దక్కిన నేపథ్యంలో ఈసారి మర్రిగూడ, నాంపల్లి మండలాల నాయకుల్లో ఆశలు పెరిగాయి. మూడు మండలాలకు ప్రాతినిధ్యం ఉన్న మార్కెట్ కమిటీలో ఈసారి ఎవరికి అవకాశం కల్పిస్తారు? రిజర్వేషన్లలో ఎలాంటి మార్పులు ఉంటాయి? ప్రస్తుత పాలకవర్గానికి పొడిగింపు ఇస్తారా? లేక కొత్తవారికి బాధ్యతలు అప్పగిస్తారా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం, పార్టీ నాయకత్వం చేసే కసరత్తు ఆధారంగా మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తదుపరి పాలకవర్గం కూర్పు ఉండనుండటంతో, చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.



## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

**చింతపల్లి, సెప్టెంబర్ 30(జనంసాక్షి)**

చింతపల్లి ఐసీఐడి ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆరోగ్యకరమైన జీవనానికి పోషకాహారం ప్రాధాన్యతపై సిడిపివో సక్కుబాయి అవగాహన కల్పించారు. ముఖ్యంగా శిశు వు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తొలి 1000 రోజుల ప్రాముఖ్యత గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, పోషకాహార లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించి, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అంజమ్మ, సుగుణ, యశోద, విజయలక్ష్మి, వసంత, ప్రసన్నలక్ష్మి, వైష్ణవి, డీసీ సతీష్, బిసి శ్రీను, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంగం బలోపేతానికి కృషి చేస్తా

**వలిగొండ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)**



సహకార సంగం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని వలిగొండ పిఏసిఎస్ ఛైర్మెన్ గరిసే రవి అన్నారు. బుధవారం సంగం ఆవరణలో నిర్వహించింసార్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగం అభివృద్ధికి,రైతులకు ఎల్ల వేళల అందుబాటులో ఉండి అన్ని రకాల సేవలు అందిస్తామని అన్నారు. రైతులు సంగం ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంగం ద్వారా వచ్చే రాయితీలు పొంది సంగం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ జక్క జంగారెడ్డి, సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

**మోటకొండూరులో ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం**

**పాల్గొన్న ఎంపీడీవో, తాహాశిల్దార్ , ఎస్సై తదితరులు**

**మోటకొండూరు, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):-**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని స్థానిక ఎంఆర్సీ భవనంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల విద్యాధికారి కె. రఘురాం రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఇందిర, తహాశీల్దార్ రాజేంద్ర ప్రసాద్, స్థానిక ఎస్సై కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో ఉన్నతమైనవని కొనియాడారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంలో గురువులు చూపే కృషి, పట్టుదల ఎంతో సహాయపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా వారు తమ పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఎంపిక చేసిన మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సీఎంఓ లింగారెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్, యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొప్పుల వెంకట్ రెడ్డి, మోటకొండూరు సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ నికిత మహేందర్, ఏఏపీసీ చైర్పర్సన్ వంగపల్లి సిద్ధమ్మ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## మృతి చెందిన గొర్రెలకు బీమా వర్తింపజేయాలి

**బీబీనగర్ (జనంసాక్షి) :**

బీబీనగర్ మండలం కొండమడుగు మెట్ సమీపంలో రైలు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలకు బీమా సౌకర్యం వర్తింపజేయాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దయ్యాల నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బీబీనగర్లో బాధితుడు కిష్టయ్యను ఆయన పరామర్శించి ప్రమాద సంఘటనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కిష్టయ్య జీవనాధారం గొర్రెలతోనే ముడిపడి ఉందని, ప్రమాదవశాత్తు తనకు ఉన్న గొర్రెలు మొత్తం రైలు ప్రమాదంలో చనిపోవడంతో అతనికి తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. ప్రభుత్వ వెంటనే బాదిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుడమ శ్రీశైలం, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లంల సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పాక జహంగీర్, బీబీనగర్ మండల కార్యదర్శి కడెం బీరప్ప, ఎర్రోళ్ల ఉపేందర్, బర్మ గణేష్, గొర్ల కాపరులు ఐలయ్య, బాలయ్య, నరసింహ, శేఖర్, బాల మల్లేష్, శ్రీశైలం, మైసయ్య లు పాల్గొన్నారు.




## జిల్లా స్థాయి పోటీల్లో చాడ విద్యార్థుల సత్తా

**మోటకొండూరు,సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**

యాదాద్రి భువనగిరి జిల్లాస్థాయిలో నిర్వహించిన పీఎంశ్రీ పాఠశాలల క్విజ్, మాక్ పార్లమెంట్ పోటీల్లో మండలంలోని చాడ పీఎంశ్రీ ఎంపీపీఎస్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బుధవారం జరిగిన క్విజ్ పోటీలో 5వ తరగతి విద్యార్థులు భవ్యశ్రీ, తనుశ్రీ, షీలాదిత్య ప్రథమ స్థానం సాధించగా, మాక్ పార్లమెంట్ పోటీలో గుర్రాల ఉమేష్ తృతీయ స్థానంలో నిలిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి తెలిపారు. విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ చాటడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయంలో విద్యార్థులకు వెన్నంటి ఉండి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయురాలు ప్రమోదినిని, గెలుపొందిన విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని డీఈఓ ఎంఈఓ, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ ఆకుల శ్రీను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించడం పట్ల తోటి విద్యార్థులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం పట్ల హర్షం

**తుంగతుర్తి సెప్టెంబర్ 30 (జనం సాక్షి)**



రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని తెలంగాణ యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ కొండరాజు అన్నారు, బుధవారం తుంగతుర్తి లో మాట్లాడుతూ నల్లగొండ- ఖమ్మం- వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి పార్టీ అధిష్టానం ఖరారు చేయడమంటే కాంగ్రెస్ పార్టీకి స్వర్గీయ దామోదర్ రెడ్డి చేసిన సేవలు కారణమని అన్నారు,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో నిరుద్యోగ యువత కోసం పలు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసిందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.గ్రాడ్యుయేట్లు, ఉద్యోగులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కి మద్దతుగా నిలిచి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుంగతుర్తిలో త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్నట్లు కొండ రాజు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా అర్హులైన గ్రాడ్యుయేట్లు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలని కోరారు.

## బైక్ మెకానిక్ అనుమానాస్పద మృతి..

**ప్రమాదమా.. హత్యా..- పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు..**

**చండూరు, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)**



నల్గొండ జిల్లా చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామ శివారులో ఓ వ్యక్తి మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభించడం కలకలం రేపింది. బుధవారం ఉదయం రోడ్డు పక్కన గడ్డి పొదల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చండూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతుడిని కనగల్ మండలం పోనుగోడు గ్రామానికి చెందిన బండమీది శ్రీను (35) గా గుర్తించారు. శ్రీను కూరంపల్లి గ్రామంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.శ్రీను మంగళవారం రాత్రి ప్రమాదానికి గురై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే మృతదేహం లభించిన తీరు, పక్కనే పడి ఉన్న బైక్, పరిసరాల్లో కనిపించిన ఆనవాళ్ల నేపథ్యంలో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలంతో పాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు ఆధారాల కోసం క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించారు.శ్రీను మృతికి అసలు కారణం ఏమిటన్నది పోస్టుమార్టం నివేదికతో పాటు పోలీసుల సమగ్ర దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసిన చండూరు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.కె మస్తాన్ నియామకం

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**



తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నూతన రాష్ట్ర కమిటీలో హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఎస్.కె మస్తాన్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. బుధవారం ఈ సందర్భంగా ఎస్.కె మస్తాన్ హైదరాబాద్‌లోని జాగృతి కేంద్ర కార్యాలయంలో కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో, జాగృతి సంస్థలో 18 సంవత్సరాలుగా క్రియాశీలకంగా పనిచేసిన తనను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు కవితకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తానన్నారు.మస్తాన్ నియామకం పట్ల జాగృతి నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**సూర్యాపేట (జనంసాక్షి):**

ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి బుధవారం హైదరాబాద్ లోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.తనను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించినందుకు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి సీఎం అభినందనలు తెలిపారు.ఓటర్ల నమోదు, ప్రచారంపై ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు ఇచ్చారు.





# తాగి బండి నడిపితే జైలే!

## ఎస్ ఐ మేడ ప్రసాద్

**బూర్గంపహాడ్ సెప్టెంబరు 30 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని బూర్గంపహాడ్ ఎస్‌హెచ్‌ఓ మేడ ప్రసాద్ హెచ్చరించారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రధాన అంబేద్కర్ కూడలిలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేసి, అవసరమైతే జైలు శిక్షకు కూడా గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. మండలవ్యాప్తంగా వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# రాకేష్ కుటుంబానికి పి ఎస్ ఆర్ ట్రస్టు అండ

## రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత..

**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 30( జనంసాక్షి)**

తిరుమలాయపాలెం పోలీసు వాహనానికి వ్యక్తిగత డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంగళవారం మృతి చెందిన కొత్తపల్లి రాకేష్ కుటుంబానికి పియస్ ఆర్ ట్రస్టు ఆర్థిక సహాయం అందించింది. ట్రస్టు తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. గత వారం రోజుల క్రితం వినాయక నిమజ్జన బందోబస్తు విధులకు వెళ్లి తిరిగి వస్తుండగా పోలీసు వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్‌తో పాటు వ్యక్తిగత డ్రైవర్‌గా పనిచేస్తున్న కొత్తపల్లి రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతున్న రాకేష్ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందారు.రాకేష్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీరోలు సొసైటీ చైర్మన్ రామసాయం నరేష్ రెడ్డి పి ఎస్ ఆర్ ట్రస్టు తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా రాకేష్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని, ఆపద సమయంలో సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాకేష్ మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ సహాయం నరేష్ రెడ్డి, సుబ్లేడు సర్పంచి సంఘ భక్తుల స్వాతి సుమన్ రెడ్డి, కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, మోరపాక నాగయ్య, జూపెడ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి, దమ్మాయిగూడెం ఉప సర్పంచ్ ఉన్నం రాజశేఖర్ , గ్రామ కాంగ్రెస్ నాయకులు తవడబోయిన కృష్ణ, నల్లగట్టు చంద్ర కిరణ్, కొత్తపెల్లి మల్లయ్య, గుండాల లింగయ్య, కొత్తపల్లి వసంత రవి, దోనపెల్లి వెంకన్న, కొత్తపల్లి రవి ఉష, దామర్ల కృష్ణ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# దమ్మాయిగూడెం లో పోషణ మాసోత్సవ కార్యక్రమం

**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 30 (జనంసాక్షి)**

తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో బుధవారం నాడు పోషణ మాసోఉత్సవాల కార్యక్రమం దమ్మాయిగూడెంలో ఘనంగా నిర్వహించారు. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబర్ నెలలో నిర్వహించే జాతీయ కార్యక్రమం పోషణ మాస ఉత్సవాలు అని సూపర్వైజర్ సావిత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026వ సంవత్సరంలో ఇది తొమ్మిదవ జాతీయ మాసొత్సవం తెలంగాణలో మంత్రి సీతక్క సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు కార్యక్రమం నిర్వహించాలని ప్రకటించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు కార్యక్రమం క్యాలెండర్ను విడుదల చేశారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అన్న ప్రసన్న, గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం పంపిణీ చేస్తారని అలాగే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని ఆమె అన్నారు. పోషకాహార ప్రదర్శన, అవగాహన ర్యాలీలు నిర్వహించి పిల్లల సంరక్షణ విషయంలో సమాజాన్ని చైతన్య పరుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు వైవిధ్యభరితమైన పోషణ పరిష్కారం

### అంగన్వాడీలో వేడిగా వండిన భోజనం

సమాజ భాగస్వామ్యం మరియు బాధ్యత పోషణ ప్రాథమిక విద్య బాలల వికాసం ప్రధానమంత్రి మాతృ వందన యోజన మరియు మాతృ సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడెం గ్రామ సర్పంచ్ వీరదాసు వినోద, గర్భిణీలు షేక్ రేష్మ, పేగు పూలనదేవి , ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సావిత్రి, తల్లులు బాజే స్పందన, సొందుబి,నవిత, రమ్య, కస్తూరమ్మ, అంగన్వాడీ టీచర్స్ ఎస్ పద్మ, కే మలుసూరమ్మ, నాగేంద్ర, నాగమణి, నిర్మల, జయమ్మ, ఎల్లమ్మ, ఉపేంద్ర, రేణుక, రంగనాయకమ్మ,ఆశ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



# విలేకరి ఇంటిపై దాడికి యత్నం

## పోలీసులకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల ఫిర్యాదు

**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 30( జనం సాక్షి)**

తిరుమలాయపాలెం మండలం లోని ముజాహిద్‌పురం గ్రామం లో పేకాట నిర్వహిస్తున్నారంటూ వార్త రాసిన నేపథ్యంలో ఓ విలేకరి ఇంటి వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కొందరు వ్యక్తులు తన ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని విలేకరి గుజ్జ రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముజాహిద్‌పురంలో పేకాట జరుగుతున్నట్లు రామకృష్ణ వార్త రాశారు. అనంతరం కొందరు వ్యక్తులు తన ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కుటుంబసభ్యులు భయాందోళనకు గురయ్యారని తెలిపారు. తనపై దాడికి యత్నించినట్లు పేర్కొంటూ పుల్లూరి నాగరాజు (36), పుల్లూరి వినయ్‌కుమార్ (25), పుల్లూరి చరణ్‌కుమార్ (20), చింత హరీష్ (25), చింత నవీంద్ర (25)లపై ఆయన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన రెండో ఎస్‌ఐ విచారణ చేపట్టారు. పూర్తి వివరాలను సేకరించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్లు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. వార్తలు రాస్తున్న విలేకరులను బెదిరించడం, దాడులకు పాల్పడటం సరికాదని ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. విలేకరులకు రక్షణ కల్పించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# రాకేష్‌కు కన్నీటి వీడ్కోలు.. కదిలొచ్చిన జనసంద్రం!

- ○ఇసుకవేస్తే రాలనంతగా తరలివచ్చిన ప్రజలు..
- ○మూడు కిలోమీటర్ల మేర జనమే జనాలు.. డీజే చప్పుళ్లు, కోలాటాలు, బాణసంచా మధ్య అపూర్వ అంతిమయాత్ర
- ○సొంత ఊరి బిడ్డకు ఘన నివాళి.. రాకేష్ చివరి చూపు కోసం పోటెత్తిన ప్రజలు

**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 30( జనం సాక్షి)**

విధి నిర్వహణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కాకరవాయి గ్రామానికి చెందిన పోలీస్ వాహన డ్రైవర్ కొత్తపల్లి రాకేష్‌కు కాకరవాయి ప్రజలు రాజకీయాలకు అతీతంగా కన్నీటి పర్యంతమై అపూర్వమైన రీతిలో అంతిమ వీడ్కోలు పలికారు. చిన్న వయసులోనే విధి నిర్వహణలో మృత్యువాత పడిన రాకేష్‌ను చివరిసారి చూసేందుకు, అతడికి కడసారి వీడ్కోలు పలికేందుకు కాకరవాయి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది తరలిరావడంతో కాకర వాయి జనసంద్రంగా మారింది. రాకేష్ అంతిమ యాత్రలో ఇసుకవేస్తే రాలనంతగా జనం కనిపిం చడంతో గ్రామంలో ఎటుచూసినా విషాదం, జనసందోహమే దర్శనమిచ్చింది.రాకేష్ అంతి మయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ప్రజలు పెద్ద సంఖ్యలో వెంట నడిచారు. ముందుకు సాగుతున్న అంతిమయాత్ర వెనుక వేలాది అడుగులు కదిలాయి. కాకరవాయి గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాకేష్‌ను కడసారి చూసి కన్నీటి వీడ్కోలు పలికారు. రహదారులన్నీ జనంతో కిక్కిరిసిపోవడంతో రాకేష్‌పై స్థానిక ప్రజలకు ఉన్న అభిమానం, ఆప్యాయత స్పష్టంగా కనిపించింది.



సాధారణంగా జరిగే అంతిమయాత్రలకు భిన్నంగా రాకేష్‌కు చివరి వీడ్కోలు పలికేందుకు యువత పెద్ద సంఖ్యలో పాల్గొంది. కుటుంబానికి చెందిన సుమారు 10 గుంటల సొంత భూమిలోనే రాకేష్ అంత్యక్రియలు నిర్వహించడం మరింత భావోద్వేగాన్ని నింపింది. తన జీవితంలో ఎన్నో జ్ఞాపకాలను మోసిన కాకరవాయి నేలపైనే రాకేష్ చివరి ప్రయాణం ముగిసింది. ఒకప్పుడు తన అడుగులతో తిరిగిన అదే నేలపై చివరకు శాశ్వత నిద్రలోకి వెళ్లడం చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. రాకేష్ భౌతికకాయాన్ని చివరిసారి చూసిన పలువురు కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు ప్రయత్నించినా వారి కన్నీళ్లను ఆపలేకపోయారు.రాకేష్ మృతితో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కష్టపడి జీవించే కుటుంబం నుంచి వచ్చిన రాకేష్ చిన్న వయసులోనే పోలీస్ వాహన డ్రైవర్‌గా విధుల్లో చేరి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. స్నేహితులతో, బంధువులతో, గ్రామస్థులతో ఆప్యాయంగా మెలిగే రాకేష్ ఇక లేడన్న వార్తను పలువురు జీర్ణించుకోలేకపోయారు. తమతో కలిసి నవ్విన యువకుడు, తమతో కలిసి తిరిగిన స్నేహితుడు, తమ గ్రామానికి చెందిన బిడ్డ ఇక తిరిగిరాడన్న వాస్తవాన్ని తలచుకుని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. రాకేష్‌ను చివరిసారి చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వాహనాలు, ద్విచక్రవాహనాలు, కాలినడకన వచ్చిన ప్రజలతో కాకరవాయి పరిసర ప్రాంతం మొత్తం జనంతో నిండిపోయింది. కాకరవాయి నుంచి అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర సాగిన అంతిమయాత్రలో జనప్రవాహం కనిపించింది. ముందుకు సాగుతున్న రాకేష్ అంతిమయాత్రకు ప్రజలు వరుసగా చేరుతూనే ఉండటంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.తన జీవితం ముగిసిపోయినా రాకేష్‌పై ప్రజలకు ఉన్న అభిమానం మాత్రం అంతిమయాత్రలో స్పష్టంగా కనిపించింది. చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రాకేష్‌కు కాకరవాయి ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఘనంగా వీడ్కోలు పలకడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కన్నీళ్లతో కుటుంబ సభ్యులు, విషాదంలో గ్రామస్థులు, అభిమానంతో కదిలొచ్చిన ప్రజలు.. డీజే చప్పుళ్లు, కోలాటాలు, బాణసంచా మధ్య సాగిన రాకేష్ అంతిమయాత్ర కాకరవాయిలో ఎన్నటికీ మరచిపోలేని విషాద ఘట్టంగా మిగిలిపోయింది.

# మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వం



- ○కల్లూరు మండలం లో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విస్తృత పర్యటన
- ○లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ
- ○ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలతో కార్పొరేట్ స్థాయిలో విద్య
- ○ రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు
- ○ఎమ్మెల్యే రాగమయి దయానంద్

**కల్లూరు సెప్టెంబర్ 30(జనంసాక్షి)**
కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చిన్న కోరుకొండి పెద్ద కోరుకొండి చెన్నూరు ఎర్రబోయినపల్లి గ్రామాలతోపాటు కల్లూరు మున్సిపాలిటీలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు , సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ఆయా గ్రామాల సర్పంచులు, పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభలలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ప్రసంగించారు.
మండలంలోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ను చెన్నూరు గ్రామంలో నిర్మాణం చేపడుతున్నామని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులు చిన్న కోరుకొండి 60, పెద్ద కోరుకొండి 153, చెన్నూరు 200, ఎర్రబోయినపల్లి130, పంపిణీ చేశారు. చెన్నూరు గ్రామంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల 200 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టామని త్వరలోనే పూర్తి చేసి 2500 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి చేపట్టిన సంక్షేమ పథకాలు రాజకీయాలకతీతంగా పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అధికార కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడం లక్ష్యంగా పెట్టుకొని అధిక ప్రాధాన్యత ఇస్తూ రేషన్ కార్డు, బస్సు ఫ్రీ, డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కోసం వడ్డీ లేని రుణాలు, 42 రకాల శిక్షణలు ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ గృహాలు, అన్ని మహిళల పేరు మీదనే ఇస్తూ వారికి సముచిత న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ గృహాలు, గ్రామాలలో సీసీ రోడ్లు సైడ్ డ్రైన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలుఅమలు అవుతాయని ఎవరికి ఎలాంటి అపోహ వద్దని అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం ప్రజల కోసమే పని చేసే ప్రభుత్వమని స్పష్టం చేశారు.

**మరోక ఊరి సమస్యతో ఎమ్మెల్యే ముందు బస్సు బాబు**
**గతంలో ప్రజాదర్బార్లో ఎర్ర బోయినపల్లి గ్రామానికి బస్సు కావాలంటూ నల్ల గట్ల**

క్రి శాంత్అనే బాలుడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకొని పోవడంతో ఆ ఊరికి బస్సు ఏర్పాటు చేశారు. అదేవిధంగా బుధవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే ముందు మరో గ్రామ సమస్యను ముందుకు తీసుకొచ్చారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని తన చదువుతున్న పాఠశాలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఎర్రబోయినపల్లికి మరో బస్సు కూడా నడిపేందుకు కృషి చేస్తానని అదే విధంగా దశలవారీగా డ్రైనేజీ వ్యవస్థ కూడా నిధులు మంజూరు చేస్తారని పాఠశాలకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తానని ఆ బాలుడికి హామీ ఇస్తూ నల్లగట్ల క్రిశాంతునుశాలవతో ఘనంగా సత్కరించారు. చెన్నూరు రైతుల ఆయకట్టు రోడ్లు నిర్మించండి ఎమ్మెల్యేని వేడుకున్నారు. చెన్నూరు గ్రామంలో ఆయకట్టు రోడ్ల వర్షం వస్తే నడిచే పరిస్థితి లేదని అదే విధంగా వాగులపైన దాటే పరిస్థితి కూడా ఉండటం లేదని మెటల్ రోడ్డు నిర్మించి బ్రిడ్జిలు నిర్మించాలని పలువురు రైతులు ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయకట్టు రోడ్డు సంబంధించి అంచనాలు రూపొందిస్తే మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయించి సమస్య పరిష్కరిస్తానని ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు.

**సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ**

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి చికిత్సకు అయిన ఖర్చులు కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను కల్లూరు లో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలో 62 మంది లబ్ధిదారులకు 17. 50లక్షల. మున్సిపాలిటీ సంబంధించి తొమ్మిది మంది లబ్ధిదారులకు రెండు లక్షల రూపాయలు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మేశ్వర రావు, పలువురు రెవెన్యూ పంచాయతీ సిబ్బంది అధికారులు, చిన్న కోరుకొండి సర్పంచ్ బూదాటి గీత, పెద్ద కోరుకొండి సర్పంచ్ దేవరపు నాగమణి. చెన్నూరు సర్పంచ్ జీనుగు శ్రీనివాసరావు, ఎర్ర బోయినపల్లి సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోట్రు అర్జున్ రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.కె ఉస్మా న్, సీనియర్ నాయకులు పసుమర్తి మోహన్రావు, శిరసాని జమలయ్య కెవిఆర్ చౌదరి, చెన్నూరు ఉపసర్పంచ్ నల్లజాల కిషోర్, భాగం ప్రభాకర్ చౌదరి,యువజన కాంగ్రెస్ నాయకులు పొట్రు చక్రి , నల్లగట్ల పుల్లయ్య, దొడ్డపనేని శ్రీనివాసరావు, మాదిరాజు అన్నం రాజు, మర్సకట్ల బాలశౌరి, మచ్చ వెంకటేశ్వరరావు, జంగా పిచ్చి రెడ్డి, వేపాకుల రామకృష్ణ,ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.



# అడవి పంది వేట కేసులో ఇద్దరి పట్టివేత

## క్లచ్ వైర్, రక్తపు మరకలున్న సంచి స్వాధీనం

**చంద్రుగొండ, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):**
చంద్రుగొండ అటవీ రేంజ్ పరిధిలోని ఎర్రగుంట గ్రామ సమీపంలో అడవి పంది వేటకు పాల్పడిన ఇద్దరిని అటవీ అధికారులు పట్టుకున్నారు. పనితి నరేష్, మల్ల శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రక్తపు మరకలున్న సంచి, వేటకు ఉపయోగించిన క్లచ్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
గస్తీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది అనుమానాస్పదంగా సంచితో వస్తున్న వారిని తనిఖీ చేయగా వేటకు సంబంధించిన సామగ్రి లభించింది. సంఘటనా స్థలంలో అడవి పంది మృతదేహాన్ని గుర్తించారు. ఘటనపై వన్యప్రాణి సంరక్షణ చట్టం?1972, సంబంధిత అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నారు.అక్రమ వేట, ఉచ్చుల ఏర్పాటు, వన్యప్రాణుల మాంసం లేదా మృతదేహాన్ని అక్రమంగా కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. అక్రమ వేటపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, సమాచారం తెలిసిన ప్రజలు అటవీ అధికారులకు తెలియజేయాలని ఎఫ్ఆర్ఓ తేజస్వి కోరారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో & వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా మైలవరం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జల్లపెల్లి నాగరాజు, కోశాధికారిగా పామర్తి శోభన్ బాబు విజయం

## 49 ఓట్ల మెజారిటీతో ప్యానెల్ గెలుపు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 30, (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు స్థానిక పెద్దమ్మతల్లి దేవాలయ సన్నిధిలోని శ్రీ శాంభవి ఫంక్షన్ హాల్ నందు బుధవారం ఘనంగా జరిగాయి.
తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా మైలవరం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జల్లపెల్లి నాగరాజు, కోశాధికారిగా పామర్తి శోభన్ బాబు ప్యానెల్ 49 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించింది.అసోసియేషన్‌లో మొత్తం 834 ఓట్లు ఉండగా, ఈ ఎన్నికల్లో 687 ఓట్లు పోల్ అయ్యాయి. రాష్ట్ర నాయకులతో పాటు జిల్లాలోని 17 మండలాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**సభ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం: మైలవరం రామకృష్ణ**
ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు మైలవరం రామకృష్ణ మాట్లాడుతూ... తన విజయోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని 17 మండలాల సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాల్లో వస్తున్న నూతన సాంకేతిక మార్పులపై సభ్యులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ప్రతినిధులు, వివిధ మండలాల బాధ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






# కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

## మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**
పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ చెత్త, దుమ్ము, మురుగుతో మమేకమై పనిచేసే కార్మికులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు.స్వచ్ఛతాహి-2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎం.వెంకటాయపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏదులాపురం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి కార్మికుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఉదయం నిద్రలేచినప్పటి నుంచి పరిశుభ్రమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి పారిశుద్ధ్య కార్మికులే ప్రధాన కారణమన్నారు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పట్టణ పరిశుభ్రత కోసం పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.
పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణ పరిశుభ్రత కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరిస్తే కార్మికులపై పనిభారం తగ్గడంతోపాటు పట్టణం మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా మారుతుందని అన్నారు.అనంతరం వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ కౌన్సిలర్లు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, కాంగ్రెస్ కౌన్సిలర్ సోము వెంకటరెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరన్న, పీహెచ్‌సీ వైద్యుడు మైధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

## అశ్వాపురంలో స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి-షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**అశ్వాపురం, సెప్టెంబర్ 30(జనంసాక్షి):** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అశ్వాపురం మండల రైతు వేదికలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి?షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు కార్డులు, చెక్కులను అందజేశారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయగా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 23 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సులభతరం చేయడంతో పాటు అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రత, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడబిడ్డల వివాహ సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



### సోలార్ ప్లాంట్ ను సందర్శించిన

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు

**ఎర్రుపాలెం,సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మండల పరిధిలోని వెంకటపురం గ్రామంలోని సోలార్ విద్యుత్ ప్లాంటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతి నిధులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం ప్రతినిధి లింగ చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా ఇక్కడ ఏర్పాటుచేసిన ప్లాంటును సందర్శించడం జరిగిందన్నారు. వెంకటాపురం సోలార్ ప్లాంట్ ప్రారంభం సమయంలో తమ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుసుకొని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు తనను కూడా కమిటీలో నియమించి సర్వే చేయాలని తెలియజేశారు. వెంకటాపురంలో మహిళా సమైక్యల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్ ప్లాంటును ఆదర్శంగా తీసుకొని ఆంధ్రాలో ఏర్పాటు చేయటానికి దీనిపై పూర్తి సమాచారం తీసుకుని ప్రభుత్వానికి నివేదిక అందిస్తానని ఆయన తెలిపారు. ప్లాంట్ ఏర్పాటులో ఏర్పడిన సమస్యలను ఏపిఎం హరి నారాయణ, ప్రాజెక్టు టెక్నీషియన్ ఆయనకు వివరించారు. విద్యుత్,రెవెన్యూ, తదితర శాఖలు పూర్తి సహకారం అందించినట్లు వారు తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి ఆదేశాలతో పల్నాడు జిల్లా కలెక్టర్ ఈ ప్లాంట్ ను సందర్శించినట్లు ఆయన తెలిపారు. వెంకటాపురంలో ఏర్పాటుచేసిన ఈ ప్లాంట్ తెలంగాణ రాష్ట్రానికి రోల్డ్ మోడల్ గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ టెక్నీషియన్ దిలీప్, ఎంపీడీవో శారద,ఏపిఎం హరి నారాయణ, గ్రిడ్డు అధికారులు, సమైక్య ప్రతినిధులు విజయలక్ష్మి,జ్యోతి, ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి,సొసైటీ అధ్యక్షులు మూల్పురి శ్రీనివాసరావు, వెన్నపూస కృష్ణారెడ్డి, జమలాపురం గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మల కుమారి,కర్నాటి సుధాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు దోమందల సామేలు,సామినేని రామారావు,వేముల వెంకటేశ్వరరావు, కోగంటి సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



### అంబేద్కర్ భవన్ పూర్తికి రూ.50 లక్షలు మంజూరు చేయాలి

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి**

**భద్రాచలం సెప్టెంబరు 30 (జనంసాక్షి)** భగవాన్‌దాస్ కాలనీలో నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ భవన్ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి డిమాండ్ చేశారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణానికి తగిన నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అవసరమైన నిధులు విడుదల చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాకోబ్ మధుసూదన్, కూరపాటి రవీందర్, లక్ష్మి, రమాదేవి, కుమారి, కిరణ్, కాలువ సుందరం మాస్టర్, మోతుకూర ఆశీర్వాదం, మంచాల నాగభూషణ్, దేగల నవీన్, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి

**ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు**

**భద్రాచలం సెప్టెంబరు 30 (జనంసాక్షి)** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. దుమ్ముగూడెం మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి -షాదీ ముబారక్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కల్యాణ లక్ష్మి- షాదీ ముబారక్ పథకానికి అర్హత పొందిన 52 మంది లబ్ధిదారులకు రూ.52,06,032 విలువైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ అన్నే సత్యాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిలక వెంకటరమణరెడ్డి, జిల్లా కార్యదర్శి లంక అబ్బులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మోతుకూరి శ్రీకాంత్‌తో పాటు పలువురు నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# రూ.13.50 లక్షలకు చికెన్ వ్యర్థాల వేలం

**అత్యధిక బిడ్డర్‌గా ఎం.రాములు**

**ఖమ్మం రూరల్, సెప్టెంబరు 30(జనంసాక్షి):** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణ, తరలింపు హక్కులకు నిర్వహించిన బహిరంగ వేలం రూ.13.50 లక్షల వద్ద ముగిసింది. అత్యధికంగా రూ.13.50 లక్షలు బిడ్ చేసిన ఎం. రాములు విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచారు. దీంతో మున్సిపాలిటీకి రూ.13.50 లక్షల ఆదాయం సమకూరనుంది. ఈ హక్కుల కాలపరిమితి 2027 మార్చి 31 వరకు కొనసాగనుంది. విజయవంతమైన బిడ్డర్ మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా చికెన్, మటన్, చేపల వ్యర్థాలను క్రమబద్ధంగా సేకరించి తరలించాల్సి ఉంటుంది. వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడం ద్వారా పట్టణంలో దుర్వాసన, అపరిశుభ్రతను నివారించి ప్రజారోగ్యాన్ని కాపాడే అవకాశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచడంతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణంగా ఎదులాపురాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.



## ఆదివాసీల హక్కుల కోసం అక్టోబర్ 5న మహాధర్నా

- భూములు, ఉద్యోగాలు, చట్టపరమైన రక్షణ కల్పించాలి
- ఇరప రాజుదొర

**భద్రాచలం సెప్టెంబరు 30 (జనంసాక్షి)** ఆదివాసీల భూములు, హక్కులు, ఉద్యోగాలు, చట్టపరమైన రక్షణతో పాటు గౌరవప్రదమైన జీవనం కోసం అక్టోబర్ 5న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజుదొర పిలుపునిచ్చారు. ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆదివాసీ యువతకు ఉద్యోగాల్లో రక్షణ కల్పించేలా చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని, జీవో నెం.3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు ఆదివాసీల భూముల అక్రమ బదలాయింపులు, ఆక్రమణలను అరికట్టి వారి భూములకు సంపూర్ణ రక్షణ కల్పించాలని కోరారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ హోం గార్డ్ అధికారులను సన్మానించిన కమిషనర్

**ఖమ్మంటౌన్ సెప్టెంబర్ (30) జనంసాక్షి.** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ హోం గార్డ్ అధికారులను సన్మానించినపోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక ను అందజేశారు పోలీస్



కమిషనర్ కార్యలయములోజరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలు అందించారనిపోలీస్ కమిషనర్ కొనియాడారు విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబసభ్యులను ఈ సందర్భంగా అభినందించారు పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి జీవితం ఆయురారోగ్యాలతోసుక సంతోషాలతో గడపాలని ఆకాక్షించారు ఉద్యోగ విరమణ పొందిన బని సర్ధార్ త్రీ టౌన్ ఎస్ ఐ.ఆ. హైమావతి (పోలీస్ హెడ్క్వార్టర్స్)ఉ. సైదులు (హోం గార్డ్) .

## బీసీ బాలుర హాస్టల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో

**నూతనకల్ సెప్టెంబర్ 30 ( జనంసాక్షి)** నూతనకల్ మండల కేంద్రంలో బిసి బాలురు వసతి గృహాన్ని ఎంపీడీవో సునీత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని



అందించాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు రాత్రి సమయంలో పిల్లలు రోడ్లపైకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్ అంజయ్య ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిసి వసతి గృహ అధికారి అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు శ్రీనిధి విద్యార్థి ఎంపిక



**మధిర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** శ్రీనిధి జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్కే షరీఫ్ రాష్ట్రస్థాయి అండర్-19 వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 8, 9, 10 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-19 వాలీ బాల్ పోటీల్లో షరీఫ్ పాల్గొననున్నాడు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న షరీఫ్ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకొని, తన ప్రతిభ తో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం పట్ల కళాశాల చైర్మన్ వై. అనిల్ కుమార్ నెహ్రు, ప్రిన్సిపాల్ తాళ్లూరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా వారు షరీఫ్‌ను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీ ల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యా ర్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.



### బాహ్య మూల్యాంకన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి

**టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు**

**ఆళ్లపల్లి సెప్టెంబర్30(జనంసాక్షి)** మండల కేంద్ర టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన బాహ్య మూల్యాంకన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయినీ మెరుగుపరచడమే లక్ష్యంగా ఉపాధ్యా యులు ఇప్పటికే అనేక బాధ్యతలను నిర్వహిస్తున్నారని అన్నారు బాహ్య మూల్యాంకన పేరుతో అదనపుపనిభారం మోపడంవల్ల ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి పెరిగి ప్రత్యక్ష బోధనకు ఆటంకం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల మూల్యాంకన ప్రక్రియను పాఠశాల స్థాయిలో బోధనకు అనుగుణం గా నిర్వహించాలని, ఉపాధ్యాయులపై అనవసరమైన యాప్ లు నివేదికలు అదనపు పని భారం తగ్గించాలని కోరారు,క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణన లోకి తీసుకొని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన అనంతరం విద్యాశాఖ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు బాహ్య మూల్యాంకన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకొని ఉపాధ్యాయులకు బోధనపై పూర్తి దృష్టి సారించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బానోతు భోజ్య జి కుమార్ రాజా,కొమరం లాలయ్య, వసంత, ఈశ్వరి,కొమరం వసంతరావు, రామకృష్ణ, వీరన్న, బద్రు, రవి, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సంపత్, శ్రీను, చిన్న, రమేష్, కోటేశ్వరీ, స్వరూప, నీలావతి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మధిర మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి కబడ్డీ శిక్షణ శిబిరం ముగింపు

**మధిర, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** స్థానిక మధిర మినీ స్టేడియంలో డిస్టిక్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ టి సునీల్ రెడ్డి , స్టేడియం ఇన్‌చార్జ్ కం అడ్మినిస్ట్రేటర్ వై. చిన్ని అధ్యక్షతన గత ఆరు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్న కబడ్డీ క్రీడాకారులకు ఈ శిక్షణ శిబిరంలో ప్రత్యేక శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె. క్రిస్టఫర్ బాబు, సుధాకర్, మాజీ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు మిర్యాల రమణ గుప్తా, 2వ వార్డు కౌన్సిలర్ భూక్య రమణ నాయక్ పాల్గొని క్రీడాకారులకు విలువైన సూచనలు అందించి రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మిర్యాల రమణ గుప్తా, భూక్య రమణ నాయక్ మాట్లాడుతూ, క్రీడాకారులు క్రమశిక్షణతో కృషి చేసి రాష్ట్రస్థాయిలో ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరు రోజుల శిక్షణ శిబిరానికి సహకరించిన మిర్యాల





రమణ గుప్తా, భూక్య రమణ నాయక్‌లను జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె. క్రిస్టఫర్ బాబు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన కబడ్డీ కోచ్‌లు కనకపుడి ప్రవీణ్, శ్రీనివాసులును ఈ క్యాంపుకు సహకరించిన బ్యాడ్మింటన్ కోచ్ సునీల్ ను కె. క్రిస్టఫర్ అభినందించారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించి రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేసిన కోచ్‌ల సేవలను ప్రశంసించారు.




## రోబోటిక్స్ పై వర్క్ షాప్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)** ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆటో మెషిన్ వంటి సాంకేతిక తలకు ప్రాధాన్యత పెరుగుతోందని విద్యార్థులు పాఠ్యాంశ పరిజ్ఞానంతో పాటు ప్రయోగాత్మక సాంకేతిక నైపుణ్యాలు లను పెంచుకోవాలని ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా సూచించారు. గురువారం ఫిజిక్స్ విభాగాధిపతి డా.జె.అనిత అధ్యక్షతన రోబోటిక్స్ పై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. సోహమ్ అకాడమీ సౌజన్యం తో రోబోటిక్స్ లో ఉపయోగించే పద్ధతులు వివిధ రంగాల్లో రోబోటిక్స్ అనువర్తనాలు తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ పవన్ కుమార్ ప్రయోగాత్మక శిక్షణ అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఏ ఎల్.ఎన్ శాస్త్రి, డా.ఏ నర్సమ్మ విభాగ అధ్యాపకులు ఎస్.రాంబాబు,డా.బి.శ్రీనివాస్, రాజశేఖర్,డా.కె.కిరణ్ కుమార్,డా.ధర్మయ్య ,వి.అనురాధ ,90మంది విద్యార్థులు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## సామాజిక వ్యవస్థలో అందరికీ అన్ని హక్కులు ఉండాలి

### డాక్టర్. కే వి కృష్ణారావు

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)** మానవులందరూ పుట్టుకతోనే అసమానులని భారతదేశ సమాజంలో కులాలుగా అంతరాలు ఉన్నాయని కులాన్ని బట్టే గౌరవాలు దక్కుతాయని. కులబేదాన్ని ప్రతి హిందువు పాటించాలని మతం నిర్దేశిస్తున్న ఈ సమయంలో ఈ వ్యవస్థపై పోరాడి మనుషులంతా ఒకటే కుల బేధాలు కల్పితాలు అనే చైతన్యం తీసుకొచ్చేందుకు అందరికీ అన్ని సమాన హక్కులు ఉండేందుకు పోరాడాలని తెలంగాణ ఉద్యమకారుల నాయకుడు డాక్టర్ కె.వి కృష్ణారావు కె.వి కృష్ణారావు మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య అన్నారు. బుధవారం నాడు రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధకు సమాజ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కుల నిర్మూలన అనే అంశంపై జరిగిన సభలో వారు ముఖ్య అతిథిలు గా పాల్గొని ప్రసంగించారు. దోపిడీ పిడనలకు వ్యతిరేకంగా రాజ్యాధికారం కోసం ఈరోజు పేదలు సామాజిక న్యాయం కోసం దళితులు ఇంత ముందుకు వచ్చి ధైర్యంగా పోరాడుతున్నారంటే అందుకు కారకులు మార్క్స్ పూలే అంబేద్కర్ లేనని అన్నారు..కుల వ్యవస్థను ఏ మత నమ్మకాల మీద నిర్మించారు ఆ నమ్మకాలను కోలగొట్టితే తప్ప ఈ అంతరాలు పోవని వారి సందర్భంగా గుర్తు చేశారు. కుల వ్యవస్థ పై పెద్ద ఎత్తున ప్రజలు పోరాడాలని




వారు పిలుపునిచ్చారు. కుల వ్యవస్థ నిర్మూలన స్త్రీ పురుష సమానత్వం సమాన హక్కులు మూఢవిశ్వాసాలు ఇవన్నీ పోయి మనిషి విశ్వనారుడుగా మారాలని పూలే కలగన్నారని నిమునకులాల కోసం స్త్రీల కోసం పాఠశాల నడపల్పి వారి కోసం తన సావిత్రిబాయి అని చదువు చెప్పి ఆమె టీచర్ గా తీర్చిదిద్దిన మహోన్నతురని వారు కొనియాడారు. కార్మికకర్షక హక్కులను కోసం, దళితులపై తరతరాలుగా సాగుతున్న బ్రాహ్మణీయ దోపిడీని ఎదిరిస్తూ నిలబడి పూలే జీవితం ప్రజలకు ఆదర్శమని వారు అన్నారు. అసమానతలు కుల వ్యవస్థ నిర్మూలన కోసం సమాజమంతా పోరాడాలి సందర్భంగా వారు పిలుపునిచ్చారు సభ అనంతరం కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామయ్య ఆవుల అశోక్ శిరోమణి ఝాన్సీ శోభ శ్రీను ఆజాద్ లక్ష్మణ్ తేజ దేవల చందు లెనిన్ సత్తార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో నీట్ లో సత్తా చాటిన విద్యార్థికి ఘన సన్మానం

**ఆళ్లపల్లి సెప్టెంబర్ 30 (జనంసాక్షి)** మండల కేంద్రం ఉమ్మడి మర్కోడు గ్రామపంచాయతీ పరిధిలో లోని అంగన్వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో నీట్ లో సత్తా చాటి ఎంబీబీఎస్ సీటు సాధించిన పాయం చాణిక్య,కు ఘన సన్మాన కార్యక్రమం. ఈ కార్యక్రమంలో నీట్ విద్యార్థి పాయం చాణిక్య,తండ్రి పాయం నరసింహారావు మాట్లాడుతూ మాది ఏజెన్సీ గ్రామం నడిమిగూడెం లో వ్యవసాయం చేసుకుంటూ పిల్లల చదువుకు ఎంతో కష్టపడ్డామని మా అబ్బాయికి ఆ దేవుడే కరుణ చూపి నీట్ లో సత్తా చాటి ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడని అన్నారు పిల్లల తల్లిదండ్రులు ఎవరైనా విద్యకు సహకరించి వారి ఉన్నత శిఖరాలకు ఎదిగేటట్టు చూడాలని చదువుల వల్ల నష్టపోయే వారు ఎవరు ఉండరని చదువుకునే విద్యార్థులు ఆలోచించుకొని ముందడుగు వేయాలని సూచించారు ఉమ్మడి గ్రామపంచాయతీ అంగన్వాడీ టీచర్స్ మాట్లాడుతూ ఎంబిబిఎస్ సీటు సాధించిన పాయం చాణిక్య,తండ్రి పాయం నరసింహారావు,పాయం సుభద్ర,లను శాలువా కప్పి ఘనంగా సన్మానించడం జరిగిందని తెలిపారు. మా అంగన్వాడి టీచర్ పాయం సుభద్ర కుమారుడు నీట్ లో సత్తా చాటి ఎంబిబిఎస్ సీటు దక్కించుకోవడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని కొనియాడారు.



## ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మరింత సేవ చేయగలం"

### చైర్మన్ మోహన్ నాయక్

**కల్లూరు, సెప్టెంబర్ 30(జనంసాక్షి):** సీడీఎంఏ ఆదేశాల మేరకు "సఫాయి మిత్ర సురక్షా ఏవం సమ్మాన్ శివిర్" కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్లూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు.. ఈ సందర్భంగా చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ "ఆరోగ్యమే మహాభాగ్యం" , ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వం మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అనంతరం మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణ రెడ్డి మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రతకు వెన్నెముక వంటివారని, వారు అందిస్తున్న సేవలు ప్రజల ఆరోగ్యం పట్టణ పరిశుభ్రతకు ఎంతో కీలకమని అన్నారు. ప్రతిరోజూ ప్రజల కోసం పారిశుద్ధ్య సేవలు అందించే సఫాయి మిత్రలు తమ ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆరోగ్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్య సిబ్బంది అందించే సూచనలు పాటించాలని కమిషనర్ కోరారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి, వారికి అవసరమైన భద్రత, ఆరోగ్య పరిరక్షణ సంక్షేమ చర్యలకు మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది శానిటేషన్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ లు కాంగ్రెస నాయకులు , , బీరెల్లి మాధవరావు దాసరి సుధారాణి భుక్య రాంబాయ్ , పెద్దబోయిన లక్ష్మీ నరసింహారావు ఉబ్బన రాంబాబు, గుండ్ల పుల్లారావు, కాంగ్రెస్ నాయకులు, కిష్టంశెట్టి కొండల్, యాసా శ్రీకాంత్ , మున్సిపల్ అధికారులు నందిశెట్టి నాగేశ్వరరావు వైద్య సిబ్బంది డా" విశ్వాస్ గారు , హెచ్ ఈ ఓ నాగేశ్వరరావు ఏఎన్ఎం విజయ్ కుమారి, భారతి, ఆశా వర్కర్లు, మున్సిపల్ అధికారులు ,మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, పాల్గొన్నారు.

# మాడుగులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ కలకలం!

- ఇద్దరు భార్యలున్నా ఒక్కరికే సర్టిఫికేట్ జారీ
- అధికారులకు తెలిసి చేశారా? తెలియక బురిడీ కొట్టారా?
- గ్రామ ప్రజల్లో జోరుగా చర్చ అయోమయంలో స్థానికులు



**మాడుగులపల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మాడుగులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో జారీ చేసిన ఒక ఫ్యామిలీ మెంబర్ (కుటుంబ సభ్యుల) సర్టిఫికేట్ ప్రస్తుతం మండలంలో తీవ్ర చర్చ నీయాంశంగా మారింది అధికారుల నిర్లక్ష్యమో లేక క్షేత్రస్థాయి పరిశీలన లోపమో తెలియదు కానీ, నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికేట్ జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అసలేం జరిగింది?**

మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి గత మే నెలలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉన్నారు. ఈ విషయం గ్రామ ప్రజలందరికీ తెలిసిన విషయమే. అయితే, మృతుడి మరణానంతరం కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా, తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఇద్దరు భార్యలలో ఒక భార్య పేరు మీదే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ జారీ చేశారు.

**అధికారులకు తెలిసే ఇచ్చారా?**

సాధారణంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ మంజూరు చేసే ముందు గ్రామ స్థాయిలో విఆర్ఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, ఈ కేసులో క్షేత్రస్థాయి పరిశీలన సరిగ్గా జరగలేదా? లేక అధికారులకు ఇద్దరు భార్యలున్నారనే విషయం తెలిసీ ఏకపక్షంగా ఇచ్చారా? అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు దరఖాస్తుదారులు నిజాలను దాచి దరఖాస్తు చేసినా, అధికారులు కనీస విచారణ జరపకుండా సర్టిఫికేట్ ఎలా మంజూరు చేశారనేది గ్రామస్తులను అయోమయానికి గురిచేస్తోంది.రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల అసలైన వారసులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? విచారణ నివేదికలో ఏం రాశారు? అనే పూర్తి వివరాలతో జనం సాక్షి దినపత్రికలో మరిన్ని వివరాలు త్వరలో...

## డిగ్రీ విద్యార్థులకు ఉపయోగకరమైన డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ పుస్తకం ఆవిష్కరణ

### - మాజీ మంత్రి , ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**

డిగ్రీ గణిత శాస్త్ర విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే పుస్తకాన్ని రచించిన డాక్టర్ కొప్పుల స్వాతి ని, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి బుధవారం అభినందించారు. హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన డాక్టర్ కొప్పుల స్వాతి ఖమ్మంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఆమె డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థుల కోసం రచించిన బిడిఫరెన్షియల్ ఈక్వేషన్స్ (అవకలన సమీకరణాలు)బి పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి పుస్తకాలు ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధనపై కూడా దృష్టి సారించాలని, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు, మాజీ ఉన్నత విద్యా మండలి సభ్యులు ఒంటెద్దు నరసింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ సర్పంచ్ క్రిష్టిపాటి అంజిరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకారపు శ్రీనివాసచారి, హుజూర్‌నగర్ మండల పీఆర్టీయూ అధ్యక్షులు కొప్పుల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ వృత్తి సమాజానికి దిశానిర్దేశం

### మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి

**పెద్దవూర సెప్టెంబర్ 30 (జనంసాక్షి )** విద్యార్థుల భవిష్యత్తును దిద్ది తీర్చి, సమాజ అభివృద్ధికి బలమైన బాటలు వేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పెద్దవూర మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఎంపికైన 24 మంది ఉత్తమ ఉపాధ్యాయులను, ఏడుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా శాలువాలతో సత్కరించి, అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కర్నాటి లింగారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి, పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని కొనియాడారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మెరుగైన వసతులను కల్పిస్తోందని, వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. ఈ వేడుకల్లో పీఏసీఎస్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మానిటరింగ్ అధికారి వెంకట్రాం నాయక్, స్పెషల్ ఆఫీసర్ సతీష్, తహసీల్దార్ కాసిం నాయక్, ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈఓ తరి రాములతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ప్రభుత్వ విప్ బీర్ల

**బొమ్మలరామారం సెప్టెంబర్ 30 (జనంసాక్షి)**

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం మండలంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో అర్హత పొందిన 1,609 కుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు.రేషన్ కార్డు కేవలం నిత్యావసర సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో కీలకమైన గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని బీర్ల అయిలయ్య వివరించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, అలాగే ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



**పిఎసిఎస్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల**

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ఖంఅూ) కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ×ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.× ఈ సందర్భంగా రైతులకు సంబంధించిన పలు అంశాలపై ఖంఅూ సభ్యులు, అధికారులు, రైతులతో ఆయన చర్చించారు.ప్రధానంగా రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల లభ్యత, వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, సాగునీరు, పంటల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. రైతులకు సాగునీటి సమస్య లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. గోదావరి జలాలను వినియోగించుకుని నియోజకవర్గంలోని చెరువులను నింపేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.



ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నీటి కొరత ఏర్పడిందని, నీటి లభ్యత తగ్గడం వల్ల విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతోందని, దీంతో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని వివరించారు.

రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీర్ల అయిలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ రాధ , ఎంపీడీవో శ్యామల, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య రెడ్డి,భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్,సింగిల్ విండో చైర్మన్ సింగిర్తి మల్లేశం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ పలువురు సర్పంచులు, ఉప సర్పంచ్లు,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

# వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటరు నమోదు షెడ్యూల్ విడుదల

## నవంబర్ 6లోగా ఫారం-18తో దరఖాస్తు చేసుకోవాలి - డిసెంబర్ 30న తుది జాబితా

**నల్లగొండ ప్రతినిధి,సెప్టెంబర్ 29,(జనంసాక్షి):**

వరంగల్?ఖమ్మం?నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు నమోదు, కొత్త ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టభద్రుల ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన షెడ్యూల్ వివరాలను వెల్లడించారు.ఓటరు నమోదు నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 28న విడుదల చేసి, దినపత్రికలతో పాటు జిల్లా కలెక్టర్, ఏఈఆర్వో కార్యాలయాల్లో ప్రచురించినట్లు తెలిపారు. అక్టోబర్ 15, 25 తేదీల్లో మరోసారి దినపత్రికల్లో ప్రకటనలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పట్టభద్రులు ఫారం?18 ద్వారా నవంబర్ 6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. డిసెంబర్ 25న అభ్యంతరాల పరిష్కారం చేపట్టి, డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.



**ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకునే అవకాశం:**

వరంగల్?ఖమ్మం?నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 12 జిల్లాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. నల్గొండ అదనపు కలెక్టర్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా (ఈఆర్వో), సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులుగా (ఏఈఆర్వోలు) వ్యవహరిస్తారని చెప్పారు.ఓటరు నమోదు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చని, ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేలా పట్టభద్రులను రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ప్రోత్సహించాలని కోరారు. 2024 ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్నవారు కూడా ఈసారి కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

**అర్హతలు ఇవే..**

2026 నవంబర్ 1 నాటికి గత మూడు సంవత్సరాల ముందు డిగ్రీ పూర్తి చేసి ఉండటంతో పాటు, సంబంధిత నియోజకవర్గంలో నివాసం ఉండే వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని కలెక్టర్ వివరించారు. ఫారం?18తో పాటు అవసరమైన స్వీయ ధ్రువీకరణ, గెజిటెడ్ అధికారి ధ్రువీకరణను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.నియోజకవర్గం మొత్తం 605 పోలింగ్ కేంద్రాలు ఉండగా, నల్గొండ జిల్లాలో 97, ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 118 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. నల్గొండ జిల్లాలో ఇప్పటివరకు పట్టభద్రుల ఓటరు నమోదుకు 3,565 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.ఎక్కువ మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు మున్సిపల్ వాహనాల ద్వారా కూడా అవగాహన కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు.

**72 వేల డాక్యుమెంట్ల పరిశీలన:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్)లో భాగంగా డాక్యుమెంట్ల పరిశీలన కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇంకా సుమారు 72 వేల డాక్యుమెంట్లను పరిశీలించాల్సి ఉందని, బీఎల్ఓలు అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరిస్తున్నారని చెప్పారు. ఈ వారంలో పరిశీలన ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.ఎస్ఎస్ఆర్‌లో భాగంగా ఓట్లను తొలగిస్తున్నారనే అపోహలను నమ్మవద్దని, వాస్తవాలను తెలుసుకుని ప్రజలు సహకరించాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్‌తో పాటు టీఆర్ఎస్ నుంచి బక్క పిచ్చయ్య, సీపీఎం నుంచి నర్సిరెడ్డి, టీడీపీ నుంచి రవి, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి డాక్టర్ అన్సారి, అద్దంకి రవీందర్, ఎంఐఎం నుంచి రఫీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం వేళ దారుణం

- ◆హత్యాయత్నం కేసులో ఎనిమిది మంది అరెస్ట్
- ◆బాధితుడిపై దాడి చేసిన తండు వరుణ్, అనుముల వేణు వర్గం
- ◆హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ కేసులు నమోదు
- ◆నిందితులను రిమాండ్‌కు తరలించిన ఇన్‌ఛార్జ్ డీఎస్పీ జి. రవి

**మాడ్గులపల్లి, సెప్టెంబరు 30 (జనం సాక్షి):**

మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో ఈ నెల 22న రాత్రి గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న హత్యాయత్నం ఘటనలో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ ఇన్‌ఛార్జ్ డీఎస్పీ జి. రవి వెల్లడించారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న రాత్రి కుక్కడం గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకలు జరుగుతున్న సమయంలో పొతేపాక సాయి కుమార్ అనే వ్యక్తిపై తీవ్ర దాడి జరిగింది అదే గ్రామానికి చెందిన తండు వరుణ్, తండు వేణు, తండు వెంకన్న, తండు లింగయ్య, అనుముల వేణు, అనుముల మహేష్, అనుముల నాగరాజులతో పాటు మొలకపట్నం గ్రామానికి చెందిన హేమంత్ గుంపుగా ఏర్పడి సాయి కుమార్‌పై విచక్షణారహితంగా దాడికి పాల్పడి హత్యాయత్నం చేశారు.బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు, విచారణ చేపట్టి నిందితులపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు ఈ దాడిలో ప్రమేయం ఉన్న ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## వార్డు మెంబర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

### ఎంపీడీవోకు తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం వినతి

**హాలియా జనం సాక్షి సెప్టెంబర్ 30:**

అనుముల మండలంలోని వార్డు మెంబర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం అనుముల మండల ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. అనుముల మండలం నల్గొండ జిల్లాలోని పరిపాలనా మండలంగా ఉంది.తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్ పోగుల నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు, అనుముల మండల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడు సింగారం మహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వార్డు మెంబర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. వినతిపత్రంలో పలు డిమాండ్లను పేర్కొన్నారు.

**ప్రధాన డిమాండ్లు**

ప్రతి వార్డు మెంబర్‌కు నెలకు రూ.3,000 గౌరవ భృతి అందించాలి. వార్డు మెంబర్లకు ప్రత్యేక హెల్త్ కార్డు లేదా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.పదవీకాలంలో వార్డు మెంబర్ మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలి.గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలపై వార్డు మెంబర్ల పేర్లను నమోదు చేయాలి.గ్రామస్థాయిలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలులో వార్డు మెంబర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఫోరం నాయకులు తెలిపారు. ప్రజలతో నేరుగా అనుసంధానమై పనిచేస్తున్న వార్డు మెంబర్ల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి డిమాండ్లను వీలైనంత త్వరగా అమలు చేయాలని కోరారు.







## సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ పెన్ పహాడ్

# పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

**రికార్డులు, కేసుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన డిఎస్పి**

**గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం**

**గంజాయి, అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం: డిఎస్పి ప్రసన్నకుమార్ హెచ్చరిక**

**పెన్ పహాడ్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) ;**

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సూర్యాపేట డిఎస్పి వి. ప్రసన్నకుమార్ బుధవారం వార్షిక ఇన్స్పెక్షన్‌లో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని అన్ని రకాల ఇన్ అండ్ అవుట్ రికార్డులను, కేస్ ఇన్వెస్టిగేషన్ డైరీలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను పర్యవేక్షించి, వారి పనితీరును అంచనా వేశారు.ఈ సందర్భంగా డిఎస్పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, గడిచిన మూడు సంవత్సరాల కేసుల వివరాల ఆధారంగా మండలంలో నేరాల సరళిని, పురోగతిని విశ్లేషించినట్లు తెలిపారు. గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణే ఏకైక ఎజెండాగా పోలీస్ శాఖ పనిచేస్తుందని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన 'స్టే అలైవ్'అరైవ్, అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో మంచి మార్పు వచ్చిందని, దీనివల్ల మండలంలో యాక్సిడెంట్ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందని హర్షం వ్యక్తం చేశారు.యువత భవిష్యత్తును నీరుగారుస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మహమ్మారులపై తాము ప్రత్యేక నిఘా ఉంచామని, వీటి నిర్మూలనకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గంజాయి, డ్రగ్స్ రవాణా లేదా విక్రయాలకు పాల్పడితే ఎంతటి వారినైనా అస్సలు ఉపేక్షించేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, మూసి పరివాహక ప్రాంతాల నుండి రాత్రి సమయాల్లో జరిగే అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడానికి ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు డిఎస్పి వెల్లడించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్సై బాలు నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...

## పట్టభద్రుల ఓటు హక్కు నమోదుపై

# అవగాహన సదస్సు

**నవంబర్ 6లోపు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి**

**పార్టీలకతీతంగా నమోదు ప్రక్రియకు సహకరించాలి: తహసీల్దార్ రాములు**

**గట్టుప్పల్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి)**

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఓటు హక్కు నమోదు ప్రక్రియపై గట్టుప్పల్ మండల తహసీల్దార్ కే. రాములు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పార్టీలకతీతంగా పట్టభద్రులను గుర్తించి, వారితో ఓటు హక్కు నమోదు చేయించేలా కృషి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ కే. రాములు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. నవంబర్ 6వ తేదీలోపు ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు కావడం అవసరమని, ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కంచుకట్ల సుభాష్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, అంతంపేట జీపీ కార్యదర్శి పోలే రామస్వామి, అంతంపేట సర్పంచ్ చందా శ్రీలత వెంకటేష్, మాజీ సర్పంచ్ మాధగోని ఆంజనేయులు, భీమనపల్లి రామయ్య, గట్టుప్పల్ సర్పంచ్ నామని జగన్నాథం, ఉపసర్పంచ్ కంచుకట్ల సుదర్శన్ తదితరులుపాల్గొన్నారు.



# పట్టభద్రులు వెంటనే ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

## మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పిలుపు



**నాగార్జునసాగర్:సెప్టెంబర్ 30 (జనంసాక్షి)**
రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల భగత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను కూడా బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తన ఓటును నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులు ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే తమ పేర్లను పట్టభద్రుల ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగానే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో ఓటరుగా నమోదైనవారు సైతం ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఫారం?18 ద్వారా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తెలంగాణలోని సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గాలకు ఓటర్ల జాబితా తాజా ప్రాతిపదికన సిద్ధం చేస్తున్న నేపథ్యంలో అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. "నేను నా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును ఈరోజే నమోదు చేసుకున్నాను. మీరు కూడా ఎలాంటి ఆలస్యం చేయకుండా మీ ఓటును వెంటనే నమోదు చేసుకోండి" అని నోముల భగత్‌కుమార్ పట్టభద్రులకు పిలుపునిచ్చారు.

# ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీ నిధులు ఖర్చులపై ఆర్టీఐ దరఖాస్తు



**చింతలపాలెం(జనంసాక్షి)**
చింతలపాలెం గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిన కాలంలో గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు,వాటి వినియోగం, గ్రామపంచా యతీ ఆదాయ వనరులు,వివిధ అభివృద్ధి పనులకు చేసిన ఖర్చులు తదితర వివరాలను తెలుసుకునేందు కు సమాచార హక్కు చట్టం?2005 లోని సెక్షన్ 6(1)కింద ఆర్టీఐ దరఖాస్తు దాఖలు చేశారు. 01-04-2023 నుంచి 31-12-2025 వరకు చింతలపాలెం గ్రామ పంచాయతీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ధ్రువీకరించిన పత్రాలతో సహా అందించాలని సంబంధిత ప్రజా సమాచార అధికారిని కోరారు. గ్రామపంచాయతీకి వచ్చిన జనరల్ ఫండ్,మినరల్ ఫండ్,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు,ఇతర నిధులు ఎంత మేరకు వచ్చాయి,వాటిని ఏయే పనులకు కేటాయించారు, ఎంత మేరకు ఖర్చు చేశారు అనే వివరాలను కోరారు. నిధుల మంజూరు ఉత్తర్వులు, ప్రొసీడింగ్స్,బిల్లులు,వౌచర్లు,చెల్లింపు వివరాలు, క్యాష్‌బుక్,లెడ్జర్లు,బ్యాంకు ఖాతాలకు సంబంధించిన రికార్డుల ధ్రువీకరించిన ప్రతులను కూడా అందించాలని కోరారు. అదేవిధంగా గ్రామపంచాయతీలో వీధి లైట్లు, ఎల్ఈడీ లైట్ల కొనుగోళ్లు,మరమ్మతులు, నిర్వహణ,విద్యుత్ బిల్లుల చెల్లింపుల కు సంబంధించిన పూర్తి వివరాలను కోరారు,ఎన్ని లైట్లు కొనుగోలు చేశారు, వాటి ధర ఎంత,మొత్తం ఎంత ఖర్చు చేశారు,ఏ నిధి నుంచి ఖర్చు చేశారు, కొనుగోళ్లకు సంబంధించిన కోటేషన్లు, బిల్లులు, వౌచర్లు,స్టాక్ రిజిస్టర్ తదితర రికార్డుల ప్రతులను అందించాలని కోరారు. ఇంటి పన్నుల వసూళ్లకు సంబంధించి 2023?2025 కాలంలో ఎంత మొత్తాన్ని డిమాండ్ చేశారు, ఎంత వసూలు చేశారు,ఎంత మొత్తాన్ని గ్రామపంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేశారు, ఆ ఆదాయాన్ని ఏయే అవసరాలకు వినియోగించారు, ప్రస్తుతం ఉన్న పన్ను బకాయిలు ఎంత అనే వివరాలను కోరారు. ఇందుకు సంబంధించిన డిమాండ్ రిజిస్టర్, కలెక్షన్ రిజిస్టర్ తదితర రికార్డుల ధ్రువీకరించిన ప్రతులను కూడా కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణ అనుమతులు ఎన్ని జారీ చేశారు, సంవత్సరాల వారీగా ఎన్ని అనుమతు లు ఇచ్చారు,వాటి ద్వారా ఎంత మొత్తంలో ఫీజులు, ఇతర చార్జీలు వసూలు చేశారు, వసూలైన మొత్తంలో ఎంత గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేశారు అనే వివరాలను కూడా కోరారు. అలాగే 01-04-2023 నుంచి 31-12-2025 వరకు జరిగిన ఆడిట్ నివేదికలు, ఆడిట్‌లో నమోదైన అభ్యంతరాలు, రికవరీలు లేదా ఇతర లోపాలు ఉంటే వాటి వివరాలు, వాటిపై తీసుకున్న చర్యలకు సంబంధించిన రికార్డులను అందించాలని కోరారు. కోరిన సమాచారానికి సంబంధించిన అసలు రికార్డులను పరిశీలించేందుకు రికార్డ్ ఇన్‌స్పెక్షన్‌కు అవకాశం కల్పించాలని కూడా దరఖాస్తులో పేర్కొన్నారు. కాగా ఈ మేరకు ఆర్టీఐ దరఖాస్తును ఎంపీవో భూపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమం లో రామిరెడ్డి,జంగాల పుల్లయ్య, రియాజ్, ముత్యం,మస్తాన్,మౌలా అసరార్, షబిల్,రఫీ,నర్సింహా రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి,పల్లె నరేందర్‌రెడ్డి ,ఇస్మాయిల్, అసిఫ్,నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు దివ్యాంగులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం

**చండూరు, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)**
భారతీయ కృత్రిమ అవయవముల తయారీ సంస్థ (ఎలిమ్కో)-హైదరాబాద్ ఆధ్వర్యంలో చండూరు డివిజన్ పరిధిలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కోసం ప్రత్యేక గుర్తింపు శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరాన్ని అక్టోబర్ 1, 2026న చండూరులోని కస్తాల రోడ్డులో గల భారతి చంద్ర గార్డెన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ద్వారా అవసరమైన దివ్యాంగులకు బ్యాటరీ మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, శ్రవణ యంత్రాలు, చంక కర్రలు, ఎంఎస్ఐఈడీ కిట్లు, ట్రైయిల్ కిట్లు, స్మార్ట్ కేన్లు, సాధారణ ట్రైసైకిళ్లను అందించేందుకు దివ్యాంగులను గుర్తిస్తారు.

**తీసుకురావాల్సిన ధ్రువపత్రాలు:**
ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు తప్పనిసరిగా క్రింది పత్రాలను వెంట తీసుకురావాలి. సదరం (డాక్టర్) సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం / రేషన్ కార్డు,ఆధార్ కార్డు పాస్‌పోర్ట్ సైజు ఫొటో (1)
యూడీఐడీ కార్డు చండూరు మండల పరిధిలోని దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి (మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ) కోరారు.

# జెడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేసిన మిర్యాలగూడ డీఎస్పీ రవి




**మాడుగులపల్లి, సెప్టెంబర్ 30( జనంసాక్షి):**
మాడుగులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మిర్యాలగూడ డీఎస్పీ రవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు పాఠశాల ప్రాంగణాన్ని, తరగతి గదులను పరిశీలించిన ఆయన, విద్యార్థుల భద్రత, పాఠశాల నిర్వహణ మరియు మౌలిక వసతుల గురించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి మాట్లాడుతూ విద్యార్థుల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు పాఠశాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు ముమ్మరం చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడిన డీఎస్పీ, చదువుతో పాటు క్రమశిక్షణే ఉన్నత భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు పాఠశాల వద్ద లేదా మార్గమధ్యలో ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు
ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం, స్థానిక సీఐ, ఎస్ఐ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు విడుదల చేయాలి



**చందంపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**
జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వెంటనే క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు జారీ చేయాలని టీయూడబ్ల్యూజే 143 దేవరకొండ డివిజన్ అధ్యక్షులు కొమ్మినేని ఆంజనేయులు యాదవ్ డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం ఈహెచ్ఎస్ స్థానంలో ఈజేహెచ్ఎస్‌ను పునరుద్ధరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా దేవరకొండతో పాటు మండల కేంద్రాల్లో గాంధీ విగ్రహాల ఎదుట పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 8 వరకు జర్నలిస్టులు ముఖ్య మంత్రి కార్యాలయానికి పోస్ట్‌కార్డులు పంపాలని కోరారు. దేవరకొండ నియోజకవర్గ జర్నలిస్టులు గాంధీ విగ్రహం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# బుల్లెట్ ట్రైన్ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
జాతీయ రహదారి 65కు సమాంతరంగా మొదట ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ను కొనసాగించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో జరుగుతున్న బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలనిమాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్ అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధనకై చేపట్టిన రిలే నిరాహార దీక్షలలో భాగంగా బుధవారం దీక్షలో పాల్గొన్న మాలమహానాడు నాయకులకు ఆమె సంఘీభావం తెలిపి మాట్లాడారు. పోరాడితే ఏదైనా సాధించుకుంటామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అలాగే సాధించుకున్నామని గుర్తు చేశారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి బుల్లెట్ ట్రైన్ సాధన బంద్ లో స్వయంగా పాల్గొన్నారని తెలిపారు. అన్ని వర్గాల పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు బుల్లెట్ ట్రైన్ సాధన కోసం ముందుకు రావాలని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి మొదటి అలైన్మెంట్ ను కొనసాగించే విధంగా బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సూర్యాపేట ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్షులు తలమల్ల హసన్, అనుములపూరి వినయ్, కామల్ల రవి, వెంకట నరసయ్య, చందాదాస్, పెరుమాళ్ళ రాజారావు,మద్దూరి కుమార్, వెంకన్న,గాజుల నరసయ్య, కట్ల మురళి,కట్ల సైదులు, వలమల్ల ప్రకాష్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు. నాయకులు పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్,చలమల్ల నరసింహ,వెలుగు వనిత, మట్టిపెల్లి సైదులు, బూర వెంకటేశ్వర్లు, భూపతి రాములు గౌడ్, కందుకూరి యాదగిరి, అడ్వకేట్ అశోక్, డాక్టర్ రవి,బయ్యా మల్లికార్జున్, యార్కచర్ల శోభారాణి,రవీందర్ నాయక్ , బీరవెల్లి శ్రీనివాస్ రెడ్డి, బోయిళ్ళ అఖిల్, గంపల కృపాకర్ తదితరులు సంఘీభావం తెలిపారు.

